ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాలికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

**విలేకరులు కావలెను**

'జనం వార్త' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 8522 055 889

మేడ్చల్ | శుక్రవారం | 25.07.2025 | సంపుటి : 1 | సంచిక :32 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

## భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రుల సంతకాలు
- బ్రిటన్, భారత్ భాగస్వామ్యం కొత్త పుంతలు తొక్కిస్తుందన్న ప్రధాని మోడీ

భారత్-బ్రిటన్ మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడంతోపాటు- ఇరు దేశాల మధ్య ఏటా 34 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని అంచనా. ఒప్పందం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాం. ఏఐ, సైబర్ సెక్యూరిటీ- వంటి అంశాల్లో కలిసి సాగుతాం. 02



## భారతీయులను నియమించుకోవద్దు

**టెక్ కంపెనీలకు ట్రంప్ హెచ్చరిక**

**వాషింగ్టన్ :** గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ టెక్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడం ఆపి.. అమెరికన్లపై దృష్టిపెట్టాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలమైన సందేశం పంపారు. ఆయన బుధవారం వాషింగ్టన్ డీసీలో జరిగిన ఏఐ సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్ కంపెనీల గ్లోబలిస్ట్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. 07లో



## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

- దేశ జీడీపీలో 5 శాతానికి పైగా తెలంగాణ వాటా
- ఇదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్రభుత్వం
- ఈ లక్ష్యసాధనలో పెట్టుబడులు పెట్టండి
- ఇన్వెస్టోపియా గ్లోబల్ సమ్మిట్‌లో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు




03

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 టిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. హెచ్ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఇన్వెస్టోపియా గ్లోబల్' అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భౌగోళికంగా చిన్నదైనా.. ఆశయాలు, ఆచరణలో తెలంగాణ చాలా పెద్దదని అన్నారు. "2024 - 25లో జీఎస్‌డీపీలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా ఉంది. రాష్ట్రంలో డ్రై పోర్ట్‌లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్-జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో ఫేజ్ - 2 వంటి ప్రాజెక్టులు పారిశ్రామికాభివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయి.



## శాస్త్రీయంగా, సమగ్రంగా తెలంగాణ కులగణన

- అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే విధానం అమలు చేయాలి
- కాంగ్రెస్ అగ్రనేతల భేటీలో నిపుణుల కమిటీ స్పష్టీకరణ
- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేసే వరకు కొట్లాడాలని పార్టీ నిర్ణయం

తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు.

**న్యూఢిల్లీ, జూలై 24 :** "దేశంలో మొట్టమొదటిసారి కులవ్యవస్థపై 'కాంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్' తయారు చేశాం. విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, కుటుంబం, ఆస్తులు తదితర అంశాల్లో బీసీలు ఎంత వెనకబడి ఉన్నారనే విషయాలను గణాంకాలు సహా సమగ్రంగా నివేదికలో పొందుపర్చాం. దేశంలో ఇంతవరకు ఏ రాష్ట్రంలోనూ ఇంత శాస్త్రీయంగా, సాంకేతికంగా, సమగ్రంగా, పక్కాగా కులగణన చేయలేదు" అని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే విధానం అమలు చేయాలని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా చర్చించాలని సూచించింది. కులగణన, బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఛైర్మన్‌గా నియమించిన మిగతా 2 లో



## రష్యాలో ఘోర విమాన ప్రమాదం

- గమ్యస్థానానికి దగ్గరలో కుప్పకూలిన అంగార విమానం
- 49 మంది మృతి

04



## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

- ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

03




11

## అనిల్ అంబానీ కార్యాలయాల్లో ఈడి సోదాలు

ఆర్థిక అవతవకలపై ఫిర్యాదులతో చర్యలు



## అభిమానుల రుణం తీర్చుకోలేనిది

- పుట్టినరోజు వేడుకల్లో కేటీఆర్
- తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న మాజీ మంత్రి
- సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురి శుభాకాంక్షలు

04




## నకిలీ ఓటర్లను మేము ఎలా అనుమతిస్తాం?

**కేంద్ర ఎన్నికల సంఘం**

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమ గ్ర సవరణపై విపక్షాలు తీవ్ర అభ్యం తరం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిం దే. ప్రతిపక్షాల విమర్శలపై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించిం ది. నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తా మంటూ ఓటరు జాబితా సవరణ ప్ర క్రియను సమర్థించుకుంది. 06



## రోజంతా ముసురు

- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- ములుగు వెంకటాపురంలో 23.52 సెం.మీ వర్షపాతం
- మరో రెండ్రోజులు వర్షాలు.. 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్

02

రాష్ట్రవ్యాప్తంగా గురువారం కూడా పలుచోట్ల వర్షాలు పడ్డాయి. ఉదయం నుంచే ఆకాశం మబ్బు పట్టింది. పొద్దున నుంచి రాత్రిదాకా జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల మోస్తరుగా ఇంకొన్నిచోట్ల భారీగా వర్షం పడింది. వరదకు వాగులు, కుంటలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. వరినాట్లు వేసిన, వేస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



03

## సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

ఏపీ అధికారులపై కేఆర్ఎంబీకి ఫిర్యాదు



03

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

## రూ.2.15 కోట్ల నగలు కొట్టేస్తే.. 'పావ్ భాజీ' పట్టించింది

ఒక్కోసారి చిన్న చిన్న పొరపాట్లే.. భారీ కుంభకోణా లను, దొంగతనాలను బయటపెడుతుంటాయి. కర్ణాటకలోని కలబురిగిలో ఇదే తరహా ఘటనే చోటు చేసుకుంది. పావ్‌భాజీ తినాలన్న కోరిక.. దాదాపు రూ.2.15 కోట్ల దొంగతనాన్ని బయటపెట్టింది.



06

## రోజుకు 7వేల అడుగులతో..

**డిప్రెషన్, డయాబెటిస్ ముప్పు దూరం : లాన్సెట్**

నడక.. మిగతా వాటితో పోలిస్తే తేలికైన వ్యాయామం. మనం వేసే ప్రతి అడుగు ఆరోగ్యదాయిని అని, మన ఆయుష్షును పెంచు తుందని ఇప్పటికే ఎన్నో సార్లు ఎన్నో అధ్యయ నాల్లో తేలింది.



06



06

## ముంబయి రైలు పేలుళ్లు..

12 మంది నిర్దోషులంటూ ఇచ్చిన తీర్పుపై సుప్రీం స్టే

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

- దేశ జీడీపీలో 5 శాతానికి పైగా తెలంగాణ వాటా
- ఇదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్రభుత్వం
- ఈ లక్ష్యసాధనలో పెట్టుబడులు పెట్టండి
- ఇన్వెస్టోపియా గ్లోబల్' సమ్మిట్‌లో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, జూలై 24 :** తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దాలనేదే మా ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ–, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను శ్రీధర్ బాబు కోరారు. గురువారం హెచ్ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్' సమ్మిట్‌లో మాట్లాడారు. అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'భౌగోళికంగా చిన్నదైనా, ఆశయాలు, ఆచరణలో మాత్రం తెలంగాణ చాలా పెద్దది. స్వల్ప కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా ఎదిగి ఇతర రాష్ట్రాలకు అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచింది. 2024–25లో జీఎస్‌డీపీలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది జాతీయ సగటు–(7.6శాతం) కంటే ఎక్కువ. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా ఉంది అందుకే తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 టిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ సంకల్పమని శ్రీధర్‌బాబు అన్నారు.రాష్ట్రంలో డ్రై పోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్–జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో ఫేజ్ –2 వంటి ప్రాజెక్టులు పారిశ్రామికా భివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్న ఫ్యూచర్ సిటీ–.. ఫిన్టెక్, క్లైమేట్‌టె–క్, స్మార్ట్ మొబిలిటీ– ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారబోతోంది. డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ– సెంటర్లు, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోంది. ఏడాదన్నర వ్యవధిలో కొత్తగా 3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు– పెరిగాయి. ఇందులో ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి కంపెనీలు ఇక్కడ పెట్టు–బడులు పెట్టాయి. మరింత మంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. యూఏఈ మాదిరిగానే తెలంగాణ కూడా సమయం, నమ్మకం, పరివర్తనకు విలువ ఇస్తుంది. ఇక్కడ ఏఐ, లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో ఎగుమతులు, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

- ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం




**న్యూఢిల్లీ, జూలై 24 :** రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో మాట్లాడారు. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దిల్లీ నుంచే సీఎంవో అధికారులతో మాట్లాడారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి. నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు సాయం చేసేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు– ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెర్వులు, కుంటలు నిండి వరద నీటి ఉదృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటు–లో ఉండాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ఎప్పుడికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు.



## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

**న్యూఢిల్లీ, జూలై 24 :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నాలుగో రోజుకి చేరుకున్నారు. బీహార్‌లోని ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ పై చర్చను నిర్వహించాలని ప్రతిపక్షాలు గత నాలుగు రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ప్లకార్డులు ప్రదర్శించంతో పాటు– వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేపట్టారు. దీంతో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. రాజ్యసభ సైతం మధ్యాహ్నానికి వాయిదా పడింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా ఎలాంటి కార్యక్రమాలు సాగలేదు.

## కులగణన సర్వే అంత తేలిక కాదు

- తెలంగాణలో రేవంత్ అంచనాలకు మించి రాణించారు
- సర్వేపై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్




**న్యూఢిల్లీ, జూలై 24 :** కులగణన సర్వే నిర్వహించడం అంత తేలిక కాదని తెలంగాణలో రేవంత్ రెడ్డి విజయవంతంగా కులగణన చేపట్టారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు అంచనాలకు మించి రాణించారని ప్రశంసించారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై ఢిల్లీలో ప్రజెంటేషన్ నిర్వహించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుటుంబ సర్వేపై ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఒబిసి రిజర్వేషన్ల వ్యవహారం, రాష్ట్రం ఆమోదించి పంపించిన బిల్లుపై ఈ సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆఫీసు రూముల్లో కూర్చొని కులగణన చేస్తే మంచి ఫలితాలు రావు. తెలంగాణ కులగణనలో దాదాపు 56 ప్రశ్నలు అడిగారు. దేశంలో నిర్వహించే కులగణనకు ఇది మార్గదర్శిగా నిలుస్తుంది. సరైన డేటా చేతిలో ఉంటేనే ఏదైనా చేయగలం. ఇప్పుడు తెలంగాణ చేతిలో సరైన డేటా ఉంది. వీధిస్థాయి వరకూ డేటా ఇప్పుడు సిద్ధంగా ఉంది. ఇండియాలో తెలంగాణకు ఉన్న స్థాయిలో డేటా మరే రాష్ట్రంలోనూ లేదు. ధనం, భూమి ఎవరి చేతుల్లో ఉన్నాయో తెలిపే డేటా తెలంగాణలో ఉంది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాల్సిన అవసరం ఉంది. అది పూర్తిగా బిజెపి భావజాలం. కులగణనను సరైన రీతిలో బిజెపి సర్కారు చేయదు. దేశ అసలైన వాస్తవ చిత్రాన్ని బహిర్గతం చేయడానికి బిజెపి ఇష్టపడదని రాహుల్ అన్నారు. సమాజాన్ని వేగంగా డెవలప్ చేసే శక్తి ఒక్క విద్యకే ఉందన్నారు రాహుల్ గాంధీ. దేశానికి ఇంగ్లీషు విద్య ఇప్పుడుచాలా అవసరం.. దళిత, ఆదివాసీ పిల్లలు ఇంగ్లీషులో చదవాల్సిన టైం వచ్చిందన్నారు. ఇంగ్లీషు తోపాటు ప్రాంతీయ భాషలు కూడా ముఖ్యమే అన్నారు రాహుల్ గాంధీ. బీజేపీ నేతలు ఇంగ్లీషు వద్దంటున్నారు.. వారి పిల్లలు ఏం మీడియంలో చదువుతున్నారో నిలదీయాలన్నారు రాహుల్ గాంధీ. వెనకబడిన వర్గాల పిల్లలు ఇంగ్లీషు చదవకూడదా అని ప్రశ్నించారు రాహుల్ గాంధీ. తెలంగాణలో కులగణన చాలా స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదో మైలురాయి అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అభినందించారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉంది.. కుల గణన నిర్వహణకు ఓ మార్గదర్శకం అన్నారు. కులగణన సక్సెస్ లో నిపుణుల కమిటీ– పాత్ర అద్భుతం అన్నారు. సరైన డేటా మన చేతిలో ఉంటే ఏదైనా చేయగలం.. ఇప్పుడు తెలంగాణ చేతిలో సంపూర్ణమైన డేటా ఉంది..తెలంగాణ అభివృద్ధికి ఇది ఎంతో తోడ్పడుతుందన్నారు రాహుల్. కులగణన నిర్వహించడం బీజేపీ సర్కర్ ఇష్టపడదు.. దేశ ముఖచిత్రాన్ని ప్రదర్శించేందుకు బీజేపీ ఇష్టపడదన్నారు.

## యువత, విద్యార్థులకు సమగ్ర శిక్షణ

- పోటాపోటీగా జాగృతి, బిఆర్ఎస్ కార్యక్రమాలు
- 26న కొంపల్లిలో జాగృతి, నాచారంలో బిఆర్ఎస్ శిక్షణ

**హైదరాబాద్, జూలై 24 :** తెలంగాణలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని మరింత పెంచేందుకు బిఆర్ఎస్,జాగృతి సంస్థలు వేర్వేరు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు ఈ నెల 26న రెండు కీలక కార్యక్రమాలు జరగనున్నాయి. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి సంస్థ యువత, మహిళలను నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో లీడర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. అదే రోజు, భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాచారంలోని ఓ కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ రెండు కార్యక్రమాలు రాష్ట్రంలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు దోహదపడనున్నాయి. తెలంగాణ జాగృతి సంస్థ, ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో యువత, మహిళలను బలమైన నాయకులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమం ద్వారా నాయకత్వ లక్షణాలను, సామాజిక సమస్యలపై అవగాహన, నిర్ణయాధికార నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ సమాజంలో మార్పు తీసుకురావాలంటే, యువత, మహిళలు నాయకత్వ బాధ్యతలు తీసుకోవాలని కవిత పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే వారికి నాయకత్వం, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం తో పాటు, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, రాజకీయాలపై అవగాహన కల్పిస్తారు. అదే రోజు నాచారంలోని కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు ప్రధాన వక్తలుగా పాల్గొననున్నారు.

## శివభక్తులపైకి దూసుకెళ్లిన కారు నలుగురు మృతి

**భోపాల్, జూలై 24 :** గ్వాలియర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగ్రా ముంబై నేషనల్ హైవేపై శివపురి లింక్ రోడ్డులో కారు అతివేగంతో కన్వరియాలపైకి దూసుకెళ్లడంతో నలుగురు భక్తులు చనిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. భదావనంలోని ఒక శివాలయం నుంచి గంగాజలం సేకరించి సిమారియా గ్రామానికి తిరిగి వస్తున్న కన్వరియాల బృందాన్ని అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోయి టైరు పేలడం వల్ల ఈ ఘటన ప్రమాదానికి దారితీసింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కన్వరియాలు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు ప్రమాదం స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇలా జరగడానికి గల కారణం అతివేగమేనని పోలీసులు భావిస్తున్నారు.


## తెలంగాణలో రెండు రోజులు భారీ వర్షాలు



**హైదరాబాద్:** ఉత్తర బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణలో ఇవాళ, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వాన పడుతుందని పేర్కొంది. ఇవాళ(గురువారం) జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ.. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగాం, మెదక్, కామారెడ్డి జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని, గంటకు 30 నుంచి 40కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంటూ.. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## ములుగు జిల్లాలో భారీ వర్షాలు

- బొగత జలపాతం వద్ద ముంచెతుతున్న వరద
- పర్యాటకులు రాకుండా అధికారుల ఆంక్షల కొనసాగింపు



**ములుగు, జూలై 24 :** ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో.. బొగత జలపాతం కనువిందు చేస్తోంది. అయితే.. బొగత జలపాతం ఉన్న ములుగు అటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలపాత సందర్శన సురక్షితం కాదని అటవీ శాఖ అధికారులు ప్రజలను హెచ్చరించారు. బొగత జలపాతం దగ్గరకు రావొద్దని సూచించారు. జులై 26 వరకూ బొగత జలపాత సందర్శనపై తాత్కాలిక నిషేధం విధించారు. బొగత జలపాతం సందర్శనపై తాత్కాలిక నిషేధం విధించిన అటవీ శాఖ అధికారులు ముత్యాలధార, కొంగల, మామిడి లొద్ది, కృష్ణపురంలో ఉన్న జలపాతాల సందర్శనపై శాశ్వత నిషేధం విధించడం గమనార్హం.బొగత జలపాతం వరంగల్ నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. వాజేడు మండల పరిధిలో ములుగు పట్టణానికి 90 కిలోమీటర్ల దూరంలో బొగత జలపాతం ఉంది. అయితే.. కాస్త వర్షాలు తగ్గాక జలపాతం అందాలను చూసేందుకు వెళ్లడం మంచిదని అన్నారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను వాతావరణ శాఖ ఇంకా హై అలర్ట్‌లోనే పెట్టింది. ఆ రెండు జిల్లాల్లో గురువారం కూడా అతిభారీ వర్షాలు కురిసాయి. ఆ రెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అయితే, పరిస్థితులను బట్టి అది రెడ్ అలర్ట్ కిందకూ మారే అవకాశాలూ లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ములుగు జిల్లా అతలాకుతలమైంది. బుధవారం ఉదయం 8.30 వరకే ములుగు జిల్లా వెంకటాపురంలో 25.5 సెంటీ–మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అదే జిల్లా ఏటూరు నాగారంలో 18.5, మంగపేటలో 15.9, ఆలుబాకలో 14.9 సెంటీ–మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి కూడా అత్యంత భారీ వర్షాలు కురిశాయి.బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి వరకు అక్కడ 21.5 సెంటీ–మీటర్ల వర్షపాతం రికార్డు అయింది. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో 23.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా మంగపేటలో 12 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రవీంద్ర నగర్‌లో 10.7, ములుగు జిల్లా ఏటూరు నాగారంలో 10.5, ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో 10.2, ములుగు జిల్లా ఆలుబాకలో 10.1, కరీంనగర్ లో 9.3, గంగిపల్లిలో 7.5, భద్రాద్రి జిల్లా మణుగూరులో 7 సెంటీ–మీటర్ల చొప్పున వర్షం పడింది.



## సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

### ఏపీ అధికారులపై కేఆర్ఎంబీకి ఫిర్యాదు

**హైదరాబాద్, జూలై 24 :** శ్రీశైలం జలాశయం నిండక ముందే వచ్చిన వరదను వచ్చినట్టే నీటిని తరలించుకుపోతున్న ఏపీ దృష్టి ఇప్పుడు నాగార్జున సాగర్ పై పడిందని, కేఆర్ఎంబీ అనుమతి లేకుండా తాగు అవసరాల పేరుతో సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేసుకున్నారు. దీనిపై తెలంగాణ కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. 2023 నవంబర్ 30న ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఏపి అధికారులు పోలీస్ బలగాలతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పై దౌర్జన్యంగా ప్రవేశించి ఏపీ వైపు నుంచి 13 గేట్లు– తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వాణ పై తెలుగు రాష్ట్రాల మధ్య వివాద రగిలింది. సాగర్ ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేందుకు కేఆర్ఎంబి కృష్ణా రివర్ యాజమాన్యం బోర్డు రంగంలోకి దిగింది. నీటి వాటాల వాడకంపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సద్దుమణిగేలా నీటి ఇరు రాష్ట్రాలకు నీటి వాటాలు కేటాయింపు నిర్వహించారు. దీంతోపాటు– ప్రాజెక్టు నిర్వహణ విషయంలో సైతం ప్రాజెక్టు 26 గేట్లలో తెలంగాణ వైపున్న13 గేట్లను తెలంగాణ అధికారులు ఏపీ వైపు ఉన్న 13 గేట్ల నిర్వహణ ఆయా రాష్ట్రాల అధికారులే మైం–టైన్ చేసేలా కేఆర్ ఎంబీ ఆదేశాలను జారీ చేసింది. అప్పటినుంచి భద్రత విషయంలో కేంద్ర సీఆర్పీఎఫ్ బలగాలు నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సుమారు 18 నెలల పాటు– ఇటు– తెలంగాణ అటు– ఏపీ వైపు భద్రత బలగాలు డ్యాం పై విధులు నిర్వహించారు. సాగర్ ప్రాజెక్టు పై నెలకొన్న ప్రాజెక్టు నిర్వహణ, భద్రత, నీటి వాటాల పంపకం, మరమ్మతుల వంటి విషయంలో కేఆర్ ఎంబీ తీసుకుని నిర్ణయాలకు ఆదేశాలకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి పని చేస్తున్నాయి. కానీ తాజాగానిన్న ఏపీ అధికారులు కేఆర్ ఎంబీ నిబంధనలను ఉల్లంఘించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడికాలువకు అక్రమంగా నీటిని వదిలారు. దీంతో మరోసారి తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం రేకెత్తింది. సాగర్ కుడి కాల్వకు అక్రమ నీటి తరలింపును వెంటనే ఆపాలని కోరుతూ తెలంగాణ ఇరిగేషన్ అధికారులు కృష్ణా రివర్ బోర్డుకు ఫిర్యాదు చేశారు.

## ప్రజాప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరు

### గతంలో ధర్నా చేసిన సందర్భంగా కేసు నమోదు



**హైదరాబాద్, జూలై 24 :** మంత్రి సీతక్క నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో అప్పటి ప్రభుత్వం సీతక్కతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌పైనా కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఆమె ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు 13కి వాయిదా వేసింది. గత విచారణలో హాజరుకాలేక పోవడంతో మంత్రి సీతక్క గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రెండు షూరిటీలు ఒక్కొక్కటి రూ.10,000 చొప్పున సమర్పించారు. దీంతో కోర్టు ఎన్‌బిడబ్ల్యూను రీకాల్ చేసింది. 2021లో కరోనా మహమ్మారి తీవ్ర స్థాయిలో విస్తరించిన సమయంలో పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీలో కరోనా చికిత్సను కలపాలని డిమాండ్ చేస్తూ సీతక్క నాయకత్వంలో నిరసన కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. అయితే, ఈ నిరసనపై ప్రభుత్వం కరోనా వ్యాప్తికి కారణమయ్యారనే ఆరోపణలతో కేసు నమోదు చేసింది. కోర్టులో హాజరైన అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. కరోనా పీక్స్ –టైమ్‌లో పేదల్ని కాపాడాలని, ఆరోగ్యశ్రీలో చికిత్స కలపాలని డిమాండ్ చేశాం. కానీ, అదే కారణంగా మాపై తిరిగి కేసులు పెట్టారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో లక్షల్లో బిల్లులు వసూలు చేసినా, బడుగుల ప్రజలు ప్రాణాలతో పోరాడినా ప్రభుత్వం స్పందించలేదు. ఇక మేము మాట్లాడితే మాత్రం ఆరోపణలు, కేసులు. ఇది బాధాకరం అని అన్నారు. న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. కోర్టు తీర్పులను గౌరవిస్తాం అంటూ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కేసులో తదుపరి విచారణను కోర్టు ఆగస్ట్ 13కు వాయిదా వేసింది.

# డబుల్ ఇంజన్ లేకుంటే పట్టించుకోరా?



రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం లేకుంటే.. అక్కడ అభివృద్ధి పనులు సాగవా? అక్కడి ప్రజలను దేశప్రజలుగా బిజెపి చూడడం లేదా...రాష్ట్రం ఏదైనా బిజెపి అధికారంలో ఉండి డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే సహకారం అందిస్తారా? ఇప్పుడు తెలంగాణ విషయంలో అదే కనిపిస్తోంది. ఎపితో పోలిస్తే తెలంగాణ పట్ల నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండొచ్చు గాక..ప్రజలనుపీడించడం ఎందుకు. పథకాలను ఆపడం ఎందుకు..నిధులను ఆపడం ఎందుకు...గత పదేళ్ల బిఆర్ఎస్ హయాంలోనూ... ఇప్పుడు కాంగ్రెస్ హయాంలోనూ ఇదే జరుగుతోంది.అవినీతి జరిగితే చర్యలు తీసుకోరు.కేవలం విమర్శలు చేసి ఊరుకుంటున్నారు. ఇలా చేయబట్టే కాళేశ్వరం విషయంలో లక్షకోట్లు తెలంగాణ ప్రజలు మునిగారు. ఇక ఎపిలో ఈ ఏడాదిలో నిధులు వరదలా పారుతున్నాయి. కేంద్రమంత్రులు ఎపికి క్యూ కట్టారు. వరాలు కోరుడు ఆలస్యం అన్నట్లుగా అన్నీ నెరవేరుస్తున్నారు. అక్కడి కేంద్రమంత్రులు నిలబడి సమస్యలను ప్రస్తావిస్తూ.. పరిష్కారాలు వెదుకుతున్నారు. దీనికి ఎవరికీ అభ్యంతరం లేదు. అక్కడా అభివృద్ధి జరగాల్సిందే. కానీ తెలంగాణను వెనకేయడం మాత్రం సరికాదు. కానీ తెలంగాణలో మాత్రం ఇద్దరు కేంద్ర మంత్రులు దుమమెత్తి పోయడానికే ఉన్నారు. నిరంతరాయంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే సరిపోతోంది. రాజకీయంగా తిట్టు ఎలా ఉన్నా...ఢిల్లీ స్థాయిలో నిలబడి తెలంగాణకు రావాల్సిన నిధులు, పనులను సాధించాల్సి ఉంది. కానీ బండి సంజయ్, కిషన్ రెడ్డిలు అలా చేయడం లేదు. నిస్సిగ్గుగా.. నిర్లజ్జగా తెలంగాణ పట్ల చూపిస్తున్న విక్ష గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది.

నిజంగానే మోడీ తెలంగాణ పట్ల కక్షసాధింపు చాటుకున్నారు. ఒక్క పైసా కూడా కేటాయింపులు లేకుండా కొన్ని రాష్ట్రాలను నిర్లక్ష్యం చేశారు. మొన్నటి బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం చేశారు. ఇందులో నూటికినూరు శాతం నిజం. కేవలం ఎన్డిఎ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే మేలు కలిగేలా తీసుకున్న నిర్ణయాలు సరికాదు. నిజానికి తెలంగాణ లేదా ఏ రాష్ట్రం అభివృద్ధి చెందినా అది దేశం అభివృద్ధికిందకే లెక్క. కానీ అలాంటి ప్రతిపాదనలు తెలంగాణ విషయంలో ఏమీ జరగలేదు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పలుమార్లు ఢిల్లీ చుట్టు తిరిగి వినతిపత్రాలు సమర్పించినా..సున్నా చూపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం చుట్టూ తిరుతామని, అభివృద్ధి వేరు, రాజకీయాఆలు వేరని సిఎం రేవతం పదేపదే చెబుతున్నారు. ఏనాడు కూడా రాష్ట్రానికి సంబంధించిన పనులు, నిధులపై సిఎం రేవంత్తో ఇద్దరు కేంద్రమంత్రులు చర్చించలేదు. ఎన్నో ఆశలతో ఇచ్చిన వినతిపత్రాల ను చిత్తు కాగితాల కింద మార్చినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణకే కాదు దేశం మొత్తం మీద బిజెపియేతర రాష్ట్రాల పరిస్థితి ఇలాగే ఉందేమో. అధికారంలో తాము లేకపోతే పట్టించు కోబోమని చెప్పకనే చెబుతున్నారు. అలాగే పేదలను గట్టెక్కించే ప్రయత్నాలు జరగలేదు. ధరలు ఎలా తగ్గించాలో చెప్పడంలేదు. ధరల పెరుగుదలకు కారణమై, సామాన్యుల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఎలాంటి చర్యలూ ప్రకటించలేదు.

ఈ దశాబ్ది ఆఖరికి పదికోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని ఘనంగా పేర్కొన్నా అందుకు తగిన కార్యాచరణ, నిధుల కేటాయింపూ కనపడ లేదు. ఉద్యోగాలు సృష్టిస్తామన్న మాట, గతంలో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీలన్నీ డొల్లగా కనిపిస్తోంది. వ్యవసాయ రంగం మీద, ఉపాధి హామీ పథకం మీదా గతంలో మాదిరిగానే మోడీ ప్రభుత్వపు చిన్నచూపు కొనసాగింది. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు, చిన్న రైతులకు, పేదలకు తోడ్పాటునిస్తున్న ఉపాధి హామీకి నిధులను తెగ్గోసింది. పాలమూరు-రంగారెడ్డి విషయం పేర్కొనలేదు. ట్రిపుల్ ఆర్ గురించి మాట్లాడడంలేదు. తెలంగాణలోని ప్రాజెక్టులను జాతీయ హోదా ఇవ్వాలని 10 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా ఆ దిశగా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణం. గత 10 ఏళ్లుగా ప్రతి బడ్జెట్లో తెలంగాణ కు కేంద్రం మొండిచేయి చూపడంతో పాటు, అనేక పనులను పెండింగ్లో పెడుతున్నారు. కంటోన్మెంట్ నుంచి కరీంనగర్, నిజామాబాద్ రోడ్ల విస్తరణ 12 ఏళ్లయినా ముందుకు సాగడం లేదు. విభజన సమస్యలకు చాపచుట్టేశారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి బిజెపికి చెందిన ఎంపిలను ఎనిమిది మంది గెలిపించినా రాష్ట్రానికి నరేంద్ర మోడీ నిధులు కేటాయించక పోవడం దారుణం కాక మరోటి కాదు. తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం మాత్రం కనీసం పట్టించుకోవడంలేదు. తెలంగాణ లోని ఏ ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఏఐబిపి స్కీంలోకి తీసుకోకపోవడం విశేషం.

తెలంగాణకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ఒక్క కొత్త ప్రాజెక్టును ప్రకటించలేకపోవడం విశేషం. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్కుకు ఆర్థిక సాయం, తెలంగాణలోని ఇండస్ట్రియల్ కారిడార్లకు నిధులు ఇవ్వడంలో కేంద్రం మొండిచేయి చూపింది. ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్ట్లో హామీ ఇచ్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలను పక్కన పడేశారు. తెలంగాణకు జాతీయ విద్యా సంస్థల కేటాయింపులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదు. తెలంగాణ కోసం ఏమి చేయదల్చుకున్నారో చెప్పాలి. అవసరమైతే కేంద్రంతో కొట్లాడి తెలంగాణ ఆత్మగౌరవం చాటడంలో కేంద్రమంత్రులు ముందు నిలబడాలి. తెలంగాణ ఫస్ట్..తరవాతే రాజకీయం అన్నది పంథా కొనసాగాలి. ఇక్కడ కాంగ్రెస్ ఉన్నా, రేపు బిజెపి వచ్చినా అభివృద్ధి జరగాలి.



## కెటిఆర్కు సిఎం రేవంత్రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూలై 24 :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈమేరకు తెలంగాణ సీఎంవో అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్టు పెట్టారు. అలాగే కేటీఆర్కు ఆయన చెల్లెలు, ఎమ్మెల్సీ కవిత జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'అన్నయ్య.. కేటీఆర్కు పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని ఎక్స్లో పోస్టు చేశారు. ఇదిలావుంటే కేటీఆర్ జన్మదిన వేడుకలు తెలంగాణ భవన్లో ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య కేటీఆర్ కేక్ కట్ చేశారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తెలంగాణ భవన్కు తరలివచ్చి ఆయనకు బర్త్డే విషెస్ తెలిపారు. వారందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తనను అభిమానించే వారి ప్రేమ, ఆశీర్వాదాలతో మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటానని చెప్పారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, ప్రశాంత్రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు. పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్ తన తల్లిదండ్రులు కేసీఆర్, శోభ ఆశీర్వాదం తీసుకున్నారు. తన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షుతో కలిసి వెళ్లి కేసీఆర్ను కలిశారు.

## ఫోన్ ట్యాపింగ్ చేసిందే మీరు

- తప్పులను కప్పిపుచుకునేందుకు సిఎంపై నిందలా
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 24 :** ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి నేతలు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని.. ఆ అవసరం తమ నాయకుడు, సీఎం రేవంత్రెడ్డికి లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బిఆర్ఎస్ తాము చేసిన పనులు ఇతరులు చేస్తారని భ్రమిస్తున్నారని మండిపడ్డారు. తమ హయాంలో చేసిన ఫోన్ ట్యాపింగ్పై సమాధానం చెప్పాలన్నారు. వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ సమర్థుడని చెప్పారు. గాంధీ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ మాది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వం. మా మంచి పాలనను ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్ష పాత్ర కూడా కేసీఆర్ సరిగా నిర్వహించలేక పోతున్నారు. ఇప్పటికే భారాసకు ప్రజలు బుద్ధి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే జరుగుతుంది. ఫామ్హౌస్కే పరిమితమవుతూ విమర్శించడం సరికాదు. మీలా ట్యాపింగ్తో రాజకీయాలు చేయాల్సిన అవసరం మా ముఖ్యమంత్రికి లేదు. మాకు మా నాయకుల మీద నమ్మకం, విశ్వాసం ఉంది. గత ప్రభుత్వంలో భార్యాభర్తలు, సినీతారలు, జడ్జిలు మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేశారని ఆది శ్రీనివాస్ అన్నారు. ఇవన్నీ త్వరలోనే బట్టబయలు అవుతాయన్నారు.



## ఆ ఒక్క పథకంతో విప్లవాత్మకమార్పు

### మహాలక్ష్మిపై సిఎం రేవంత్ ఎక్స్లో పోస్ట్

**హైదరాబాద్, జూలై 24 :** ఒక సంక్షేమ పథకం అనేక విప్లవాత్మక మార్పులకు కారణమైందని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆడబిడ్డలకు ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచిందని పేర్కొన్నారు. ఒక్క పథకం వల్ల ఆర్టీసీ సంస్థ అప్పుల నుంచి గట్టెక్కిందని తెలిపారు. 200 కోట్ల జీరో టికెట్లతో సరికొత్త రికార్డుకు చేరుకుందని వివరించారు. ఆర్టీసీకి ప్రాణం పోసిన ప్రతి ఉద్యోగి, సిబ్బంది, కార్మికులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ యాజమాన్యానికి, మంత్రి పొన్నం ప్రభాకర్కు అభినందనలు తెలిపారు. ఈ ఒక్క పథకం వల్ల ఆర్టీసీలో ఆడబిడ్డల ఆక్యుపెన్సీ 35 నుంచి 60 శాతానికి పెరిగింది. ప్రజాపాలన ప్రారంభమయ్యే నాటికి ..ఇక ఆర్టీసీ కథ కంచికే అన్నట్లు-గా పరిస్థితి ఉండేది. పేదవాడి ప్రగతి రథ చక్రం ఇక చరిత్ర పుటల్లోకి జారిపోతుందనే విధంగా ఉండేది. అక్కడ నుంచి మొదలైన ప్రయాణం నేడు 200 కోట్ల జీరో టికెట్లతో ఆడబిడ్డలకు సాయం చేసిందని రేవంత్రెడ్డి తెలిపారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

- సిఎం రేవంత్ వైఖరిలో మార్పేనిదర్శనం
- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరంలపై నత్తనడక విచారణలు
- బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ విమర్శలు



**హైదరాబాద్, జూలై 24 :** తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ - కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాల అసలైన రూపం బయటపడిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ప్రకటన విడుదల చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర కేసులపై నత్తనడక విచారణలు రేవంత్ చిత్తశుద్ధిపై అనుమానలు కలుగుతున్నాయని అన్నారు. ఇందులో ఆమె అనేక అంశాలపై తనదైన శైలిలో వివరించారు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే 'హైడ్ అండ్ సీక్' రాజకీయ నాటకం కొనసాగుతోందని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్, వ్యక్తిగత నిఘా, గోప్యత ఉల్లంఘనలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపణలు చేశారన్నారు. తనతో పాటు తన కుటుంబం ఫోన్లు ట్యాపింగ్ కు పాల్పడ్డారని మాట్లాడారని.. కానీ, ఇప్పుడు ఆయన అవన్నీ మరిచినట్టుగా, ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే తనకు నోటీసులు వచ్చేవి కదా అనే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అలాంటప్పుడు గతంలో రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నాటకమా..? లేక ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీతో కుదిరిన ప్యాకేజీ డీలే కారణమా..? అనే అనుమానం కలుగుతోందని అన్నారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ప్యాకేజీ బేరాలు కుదిరాయనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీలు ప్రజల ముందు కేవలం మాటల యుద్ధం చేసుకుంటూ కుమ్ములాటలు చేసుకుంటూ, చీకట్లో ప్యాకేజీలు కుదుర్చుకుం టున్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంపై ఇప్పటికే కేంద్ర వ్యవస్థలు సంచలన విషయాలను బయట పెట్టాయన్నారు. ఈ విషయంలో నాడు పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసి.. అధికారంలోకి వచ్చాక అదే బీఆర్ఎస్ పార్టీకి రక్షణ కవచంగా మారారన్నారు. రూ. 38,000 కోట్లతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ. 1.2 లక్షల కోట్లకు పెంచిన సంగతి తెలిసిందేనని.. వేల కోట్లు- వృథా చేసినట్లు- కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు స్పష్టంగా పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టులో టెండర్ల మంజూరు, పునర్నిర్మాణ ఖర్చులు, నిర్మాణ వైఫల్యాలపై సంపూర్ణ విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగైనా ముందుకు వేయకుండా, ఈ కేసును నీరుగార్చే కుట్రలకే పాల్పడుతోందన్నారు. గత 19 నెలలుగా కాళేశ్వరం అవినీతి దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తూ.. అసలు దోషులను అరెస్ట్ చేయకుండా విమర్శలకే పరిమితమైందని పేర్కొన్నారు. ఇప్పటి-కై-నా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో సీబీఐ విచారణకు కోరి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

## గోదావరి వద్ద పెరుగుతున్న నీటిమట్టం

**భద్రాచలం, జూలై 24 :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం ఉదయం గోదావరి నీటిమట్టం 21 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగడంతో దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగింది. సీతమ్మ వాగులోకి నీరు చేరడంతో నార చీరల ప్రాంతానికి పర్యాటకులను ఆపివేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు గోదావరి తీరంలో ప్రజలను అప్రమత్తం చేశారు.

# ఆ ఒప్పందం భారీ విజయం

### మోదీ పర్యటన వేళ బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యలు

**బ్రిటన్ :** ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తుతం బ్రిటన్లో పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా రెండు దేశాల మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది తమ దేశానికి దక్కిన భారీ విజయమని అభివర్ణించారు. దీనిద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. వ్యాపారాలకు కొత్తదారులు తెరుచుకుంటాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అంశంపై ఇరుదేశాల మధ్య మూడేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. బోరిస్ జాన్సన్ ప్రధానిగా ఉన్నప్పటినుంచి ఇరుదేశాల మధ్య చర్చలు నడుస్తూ వచ్చాయి. స్వేచ్ఛా మార్కెట్, వాణిజ్య ఆంక్షలు సడలించడం ద్వారా 2040 నాటికి ఇరుదేశాల వాణిజ్యాన్ని 25.5 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పలు దఫాలుగా చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే 99 శాతం ఉత్పత్తులకు జీరో టారిఫ్ వర్తిస్తుంది. అలాగే, బ్రిటన్ నుంచి భారత్కు దిగుమతయ్యే విస్కీపై సుంకం 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గనుంది. నిర్దేశిత కోటా మేరకు ఆటోమొబైల్ దిగుమతుల సుంకం 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గనుంది. వీటితో పాటు వైద్య పరికరాలు, అధునాతన మెషినరీ పరికరాలు, చాక్లెట్లు, బిస్కెట్లపై టారిఫ్లను భారత్ తగ్గించనుంది. అలాగే, సామాజిక భద్రత ఒప్పందంలో భాగంగా



బ్రిటన్లో పనిచేసే భారతీయులు సోషల్ సెక్యూరిటీ ఫండ్స్ కింద రెట్టింపు చెల్లింపు చేయాల్సిన అవసరం తప్పుతుంది.

### అది ఎంతగానో హత్తుకుంది : మోదీ

నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మోదీ బ్రిటన్, మాల్దీవుల్లో పర్యటిస్తున్నారు. ఈక్రమంలోనే బుధవారం రాత్రి లండన్కు చేరుకున్నారు. బ్రిటన్ రాజు ఛార్లెస్-3ని కూడా కలవనున్నారు. ఇక లండన్లో దిగిన ప్రధానికి ప్రవాస భారతీయుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. స్వదేశం పురోగతిపై వారు చూపుతోన్న నిబద్ధత తనను ఎంతగానో హత్తుకుందని ఆయన వారిని ఉద్దేశించి సంతోషం వ్యక్తంచేశారు.



## ఏనుగు దాడిలో సీఈఓ మృతి

**దక్షిణాఫ్రికా :** ఏనుగు దాడిలో ఒక సంపన్న సీఈఓ ప్రాణాలు కోల్పోయారు. ఆయన దక్షిణాఫ్రికాలో విలాసవంతమైన గోండ్వానా ప్రైవేటు గేమ్ రిజర్వ్కు సహ యజమానిగా వ్యవహరిస్తున్నారు. ఏనుగును పక్కకు తోలుతుండగా ఈ ఘటన చోటుచేసుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ గేమ్ రిజర్వ్ సీఈఓ పేరు ఎఫ్సీ కాన్రాడీ (39). దక్షిణాఫ్రికా ఎకోటూరిజంలో ఆయన అందరికీ సుపరిచితులు. రోజూలాగే కార్యకలాపాలు పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. టూరిస్టు లాడ్జిలకు దూరంగా ఏనుగుల గుంపును తోలుతుండగా.. ఒకటి మాత్రం విపరీతంగా ప్రవర్తించింది. తన దంతాలతో నెట్టి, పలుమార్లు తొక్కిందని, పక్కనే ఉన్న రేంజర్లు కాన్రాడీని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వెల్లడించారు. గోండ్వానా ప్రైవేటు గేమ్ రిజర్వ్.. ఫైవ్స్టార్ సఫారీ లాడ్జి. బిగ్ ఫైవ్ (ఆఫ్రికా సింహం, ఏనుగు, చిరుతపులి, కేప్ బఫెలో, ఖడ్గమృగం)ను చూసిన అనుభూతి కోసం ఇక్కడికి పలువురు ప్రముఖులు, పర్యాటకులు వస్తుంటారు. కాగా.. గత ఏడాది కూడా ఈ రిజర్వ్లో ఇలాంటి ఘటనే జరిగింది. 36 ఏళ్ల సిబ్బంది ఒకరు ఇలాగే ఏనుగు దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ వరుస ప్రమాదాలతో ఈ ప్రదేశాల్లో భద్రతా నియమావళిపై చర్చ మొదలైంది.



## రష్యాలో కుప్పకూలిన విమానం 49 మంది మృతి

**రష్యా :** రష్యాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 49 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలో కుప్పకూలింది. తొలుత ఈ విమానం అదృశ్యమైనట్లు వార్తలు రాగా.. కాసేపటికే అది కూలిపోయినట్లు అధికారులు నిర్ధరించారు. ఈ దుర్ఘటనలో విమానంలోని ప్రయాణికులందరూ మృతి చెందారు. అంగారా ఎయిర్లైన్ కు చెందిన ఏఎన్-24 విమానం గురువారం ఉదయం బ్లాగోవెష్చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవ్వాల్సి ఉండగా.. ఉన్నట్టుండి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎమర్జెన్సీ సర్వీసెస్ను సిద్ధం చేశారు. విమానం కోసం గాలించగా.. గమ్యస్థానానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో అది కూలిపోయినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదం ధాటికి విమానం పూర్తిగా కాలిపోయింది. రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ విమానం తొలుత ల్యాండింగ్కు ప్రయత్నించగా.. పరిస్థితులు అనుకూలించలేదట. రెండోసారి ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. రాడార్ నుంచి గల్లంతై కూలినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 43 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికుల్లో ఐదుగురు చిన్నారులు ఉన్నట్లు రష్యన్ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానం కూలిన ప్రాంతంలో శకలాలకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. ఈ ప్రమాదంలో మొత్తం 49 మంది మరణించారని ఎమర్జెన్సీ సర్వీసెస్ చెప్పినట్లు రష్యా అధికారిక మీడియా కథనాలు వెల్లడించాయి. ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించక పోవడం, పైలట్ తప్పిదం కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

### పాండల శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో..



**చర్లపల్లి, జులై 24 (జనం వార్త) :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు గురువారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినని పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ చక్రిపురం చౌరస్తాలో పార్టీ నాయకులతో కలసి శివకుమార్ గౌడ్ కేకును కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కేటీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరిగిందన్నారు. అధికారం లేకున్నా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేమూరి మహేష్ గౌడ్,బొడిగె రాజు గౌడ్,గంప కృష్ణ,శ్రీకాంత్ రెడ్డి,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బోడుప్పల్‌లో ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

### మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో..

**మేడిపల్లి,జూలై 24 (జనం వార్త) :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ జేడ్పీటీసీ మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కల్వకుంట్ల తారక రామారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జనరల్ సెక్రటరీ మీసాల కృష్ణా,మాజీ మేయర్ సామల బుచ్చి రెడ్డి,కొత్త చక్రపాణి గౌడ్,కాటేపల్లి రాంచందర్ రెడ్డి,కొత్త రవి గౌడ్,బండారి శ్రీధర్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్,కే నర్సింహా,శ్రీహరి గౌడ్,ఉప్పరి విజయ్, కాటం రాజిరెడ్డి,బొమ్మక్ విశ్వనాద్,చంటి శ్రీను, ధర్మ నాయక్,పవన్, శత్రుఘ్ననా, సురేందర్ రెడ్డి,నార్సింగి నాయక్, దీటి గణేష్,బింగి శ్రీకాంత్, కృష్ణా,మనోహర్ రెడ్డి, వినయ్,ప్రవీణ్,పార్టీ నాయకులు,యువజన నాయకులు,డివిజన్ ఇంచార్జులు, డివిజన్ ప్రసిడెంట్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన మాజీ మేయర్ వెంకట్ రెడ్డి

**మేడిపల్లి,జూలై 24 (జనం వార్త ) :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేకును కటింగ్ చేసి మాజీమంత్రి కేటీఆర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## నేటి నుండి మోగనున్న పెళ్లి బాజాలు

**రంగారెడ్డి ప్రతినిధి, జూలై 24:** ఈనెల 25వ తేదీ నుండి శ్రావణమాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ఉభయ తెలుగు రాష్ట్రాలలో పెండ్లి బాజాలు మోగనున్నాయి. జూలై 26, 30, 31, ఆగస్టు 1,3, 5,7, 8,9, 10, 11, 12,13, 14, 15, సెప్టెంబర్ 24, 26, 28, అక్టోబర్ 1,2, 3,4,8, 10,12, 22,24,29, 30,31, నవంబర్ 1, 2,7,8,12, 13, 15, 22,23, 26,27, 29, 30, ఈ తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు తెలియజేస్తున్నారు. భాద్రపద మాసం ఆగస్ట్ 21 నుండి సెప్టెంబర్ 21 వరకు ముహూర్తాలు లేవని బ్రాహ్మణ పండితులు తెలుపుతున్నారు.

# వినియోగదారుడే వీఐపి

## మాచన రఘునందన్



**కూకట్ పల్లి,జూలై 24, (జనం వార్త) :** బంకులను వినియోగదారుల ఆదరణ పొందేలా నిర్వహించాలని వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. గురువారం ఆయన హైద్రాబాద్ లో మీడియాకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ నగరంలో కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో మరుగు దొడ్ల నిర్వహణ అపరిశుభ్రంగా ఉంటుందని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మరుగుదొడ్ల తలుపులకు తాళం వేసి ఉంటుందని, రిపేర్లో ఉందని,ఇలా ఏవో కారణాలు చెప్తూ టాయిలెట్స్ ను సరిగా మెయింటైన్ చేయడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెట్రోల్ బంకుల్లో మరుగు దొడ్ల నిర్వహణ సరిగా లేకపోతే చమురు సంస్థలు జరిమాన విధించే అవకాశం ఉందని రఘునందన్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నో స్టాక్ బోర్డు పెట్టవద్దని పెట్రోల్ బంకు యాజమాన్యాలకు రఘునందన్ హెచ్చరించారు. వాహనాల్లో గాలి నింపే యంత్రం పని తీరు సవ్యంగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. మిషన్ రిపేర్ లో ఉంది అని సాకు లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయ డం భావ్యం కాదని రఘునందన్ స్పష్టం చేశారు. పెట్రోల్ బంక్లు ఉపాధి అవకాశంగా భావించి సేవా భావంతో నిర్వహించాలని సూచించారు. ప్రతి పెట్రోల్ బంక్ లో వినియోగదారుల హక్కులు సూచించే వివరాలు ప్రదర్శించాలని రఘునందన్ సూచించారు. వర్షాకాలం లో అప్రమత్తంగా ఉంటే పెట్రోల్ లో నీళ్లు కలిశాయి అనే ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త లు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రఘునందన్ వివరించారు. ఏ వ్యాపారం ఐనా వినియోగదా రుల ఆదరణ పై నే ఆధారపడి ఉంటుంది తప్ప, వినియోగదారుడు వ్యాపారం పై ఆధార పడి ఉండరని,ప్రతి వ్యాపార సంస్థ,ప్రతి పెట్రోల్ బంక్ నిర్వాహకు లు గ్రహించి సేవ లు అందించాలని రఘునందన్ స్పష్టం చేశారు. కొన్ని మార్లు చిన్న చిన్న విషయాలు కూడా పెద్ద సమస్యలు గా మారి కేసు నమోదు చేసే వరకు దారి తీసే అవకాశం ఉంటుందని కావున పెట్రోల్ బంక్ యజమాన్యాలు ఆయా పెట్రోల్ బంక్ లను ఎంత జాగ్రత్త గా కనిపెట్టుకుని ఉంటే అంత గా సమస్యలు,ఫిర్యాదుల కు ఆస్కారం ఉండదని హితవు పలికారు. ప్రతి పెట్రోల్ బంక్‌లో నాణ్యత ను పరీక్షించే బ్లాటింగ్ పేపర్ ను అందుబాటులో ఉంచాలని రఘు నందన్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమర్యాదగా అనుచితంగా కటువుగా,కర్కశంగా మాట్లాడటం చేయకూడ దని మాచన రఘునందన్ పెట్రోల్ బంక్ నిర్వాహకులను హెచ్చరించారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు కొనసాగుతున్న ఈ సమయం లో పెట్రోల్ బంక్ ల్లో ఎక్కడ కూడా నో స్టాక్ బోర్డు పెట్టే పరిస్థితి తలెత్తకుండా, నిల్వలు ఎప్పుడూ ఉండేలా జగత్త లు తీసుకోవాలని రఘునందన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## విద్యార్థులు ఇష్టంగా చదివి

# ఫలితాలు సాధించాలి

- శామీర్ పేట్ మండలంలో పాఠశాలను తనిఖీ
- జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 24(జనం వార్త) :** విద్యార్థులు ఇష్టంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని,అందుకు అవసరమైన వసతులను కల్పిస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం శామీర్ పేట్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి విజయ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని,తరగతి గదులు ఎన్ని ఉన్నాయని హెడ్ మాస్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి



గదులు,మూత్ర శాలలు అవసరమని హెడ్ మాస్టర్ తెలుపగా, ఇంజనీర్లతో అంచనాలు వేయించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టరు సూచించారు. అనంతరం సిలబస్ ఎంత వరకు జరిగిందని, భోజనం ఎలా ఉంటుంది,ఇంకేమైన మీకు సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అన్ని సౌకర్యాలు బాగున్నాయని, మధ్యాహ్న భోజనం బాగుంటుందని విద్యార్థులు సమాధానమిచ్చారు. కలెక్టర్ పాఠశాలనంతా తిరిగి కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు అర్థం చేసుకునే విధంగా సులువుగా సారాంశం అర్దమయ్యేలా చెప్పాలనే అంశాలను గ్రహించాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట తహాసీల్దార్ యాదగిరిరెడ్డి,మున్సిపల్ కమీషనర్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పాలన అధికారి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 24(జనం వార్త) :** గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్ పల్లి మహిళా డిగ్రీ కాలేజీలో ఈనెల 27న జరుగనున్న గ్రామ పాలన అధికారి పరీక్ష నిర్వహణ పై అదనపు కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశని నిర్వహించారు. జిల్లాలోని 55 మంది అర్హులైన విఆర్ఓలు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు,ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని అదనపు కలెక్టరు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చెరుకోవాలని ఆయన పేర్కొన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు గాను పోలీసు,రెవెన్యూ మెడికల్,ఎలక్ట్రిసిటి సంబంధిత శాఖల వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టరు ఆదేశించారు.



## హరిహర వీరమల్లు సినిమాను

# తిలకించిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

- బాణసంచా కాల్చుతూ థియేటర్ కు ర్యాలీ.
- భారీ సంఖ్యలో పాల్గొన్న జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు

**కూకట్‌పల్లి, జూలై 24, (జనం వార్త) :** ప్రముఖ హీరో, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాను కూకట్ పల్లి జనసేన ఇన్ ఛార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ తన కుటుంబ సమేతంగా, జన శ్రేణులతో, అభిమానులతో కలిసి గురువారం తిలకించారు. కూకట్ పల్లి లోని భ్రమరాంబ థియేటర్ లో ఉదయం 7 గంటల ప్రదర్శనకు జనసేన కార్యాలయం నుండి భారీ ఎత్తున జనసేన నాయకులు, వీర మహిళలు, అభిమానులతో కలిసి బయలుదేరారు. ఈ సందర్భంగా అభిమానులు బాణాసంచా కాల్చుతూ, ర్యాలీతో భ్రమరాంబ థియేటర్ కు చేరుకున్నారు.




జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు సినిమా చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సినిమాను తిలకించారు.




## ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయాలి

### అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

**మేడ్చల్, జూలై 24:** మాత శిశు ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయాలని వైద్య సిబ్బంది కృషి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంటిగ్రేటడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ లో రాష్ట్రీయ బాల్ స్వస్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా రాధికా గుప్తా మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, వైకల్యాల లాంటి వాటిని ముందస్తుగా గుర్తించడం ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ అందించవచ్చునని పేర్కొన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ పిల్లల జీవన ప్రమాణలను మెరగుపరిచి సమగ్ర సంరక్షణ అందించడమే రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఆర్‌బిఎస్‌కె టీమ్ విధులు,కార్యాచరణ గురించి వివరించారు. అనంతరం అంగన్వాడీ ఆరోగ్య స్క్రీనింగ్, కంటిపరీక్షలు వికాస ఆలస్యం గుర్తింపు లాంటి అంశాల పై సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్బంగా డిఎంహెచ్ వో నీలోఫర్ ఆసుపత్రికీ రెఫెర్ అయిన కేసులు, ప్రస్తుతం చికిత్స పొందుతున్న కేసులు ఫాలోప్ కేసుల వివరాలను అదనపు కలెక్టర్ రాధికా గుప్తా కు వివరించారు. ఫీల్డ్ లో ఎదురవుతున్న వైద్యాసిబ్బంది ఎదుర్కొని సమన్వయంతో ముందుకుసాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లాకు చెందిన వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వేలం భూములను సందర్శించిన రాజీవ్ స్వగృహ ఎండి

**మేడ్చల్, జూలై 24:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో త్వరలో వేలం ద్వారా విక్రయించునున్న ప్రభుత్వ స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర రాజీవ్ స్వగృహ ఎం. డి. పి.వి.గౌతమ్ గురువారం సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆయన వేలం ద్వారా విక్రయించునున్న భూముల వివరాలను వెల్లడించారు. కెపిహెచ్ బి. హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల 2420 చదరపు గజాల స్థలం, 4598 చదరపు గజాల ప్లాట్లతోపాటు సుమారు 7.8ఎకరాల ఖాళీ స్థలాన్ని ఈ ఆక్షన్ ద్వారా విక్రయించడానికి నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం కూకట్ పల్లి లోని స్లం ఏరియాలైన ఇందిరానగర్, ఎన్టీఆర్ నగర్, వడ్డెరబస్తి, ముసపేట, చిత్తరమ్మాబస్తీ లో శితిలావస్థకు చేరిన ఇళ్లను గౌతమ్ పరిశీలించారు. బస్తీ వాసులతో శితిలావస్థకు చేరుకున్న ఇళ్ల స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఇందుకు కాలనీ వాసులంతా ఏకతాటిపై వచ్చి సమ్మతిని తెలియచేయాలనీ సూచించా రు. ఇందుకు కాలనీవాసులు ఉన్న ఇళ్లను కూల్చేస్తే మేము ఎక్కడ ఉండాలని ప్రశ్నిం చారు. ఇందుకు గౌతమ్ స్పందించి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేవరకు ప్రభుత్వం ప్రత్యా మ్నాయం ఆలోచిస్తుందని తెలిపారు. జీప్లస్3 విధానంలో ఇళ్లను నిర్మించి మౌలిక వసతులను కల్పించనున్నట్లు రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ పి వి. గౌతమ్ వివరించారు.

## 27న గ్రామ పాలన అధికారి పరీక్ష

**మేడ్చల్, జూలై 24:** గ్రామపాలన అధికారి పరీక్ష ఈ నెల 27 న నిర్వహించనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయెందర్ రెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగే గ్రామపాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఇదివరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 55 మంది విఆర్వో లు ఆప్షన్స్ ఇచ్చారని వారికీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించే పరీక్షకు అభ్యర్థులు అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విజయెందర్ రెడ్డి అన్నారు. పరీక్ష సజావుగా జరిగేందుకు పోలీస్, రెవెన్యూ, మెడికల్, ఎలక్ట్రిసిటీ శాఖల సిబ్బంది వారికీ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విజయందర్ రెడ్డి అధికారులను అదేశించారు.



## ఘనంగా కేటిఆర్ జన్మదిన వేడుకలు

**దమ్మపేట, జూలై 24:** దమ్మపేట మండల కేంద్రంలో బిఆర్‌యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రివర్యులు పుట్టినరోజు వేడుకలు మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిదిగా నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కటింగ్ చేసారు. లక్ష రూపాయల చెక్‌ని ఇటీవల విధ్యుత్ షాక్ ప్రమాదంలో చనిపోయిన మొద్దులగూడెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త తంగేళ్లముడి పోలయ్య కుటుంబ సభ్యులకు అందజేసారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ లో పెషేంట్ లకు పండ్లు,బ్రెడ్ ని పంపిణి చేయటం జరుగుతుంది. కార్యక్రమంలో మండల కార్యదర్శి దొడ్డా రమేష్,మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు,మాజీ ఉప సర్పంచ్ దారా యుగుందర్,అంకత ఉమ మహేశ్వరావు, జలగం వాసు,గుమ్మడపు విష్ణు,మాజీ సర్పంచ్ అల్ల జంగం,సోడెం గంగరాజు,మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు,కార్మిక విభాగ మండల అధ్యక్షులు గాజుబోయిన శ్రీనివాసరావు (ఆటో )నియోజకవర్గ యూత్ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీను,మండల యూత్ అధ్యక్షులు సత్య, నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షులు రావుల శ్రీనివాసరావు,మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్, మాజీ సర్పంచ్ లు దారా నరసింహారావు,కోర్స శ్రీను,మొడియం ముత్యాలరావు,చీకటి రామయ్య,తుమ్మల లక్ష్మనరావు,రెడ్డిమళ్ళ నాగయ్య,కోర్స వెంకటేశ్వరావు,అబ్దుల్ జిన్న,గుత్తి శ్రీనివాసరావు, నెల్లూరి గోపాలరావు,నెల్లూరి గోపాల కృష్ణ,కొందరి సత్యనారాయణ,జల్లిపల్లి కృష్ణ మోహన్,మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ బుడే,పసుమర్తి విరభద్రం,తాళ్ల వెంకటశ్వరావు,మాజీ ఎంపీటీసీ కాసిన శ్రీను,బలుసు గోపి,మహేష్,పుల్లారావు,ఉకే రాజు, ముత్తేశ్వరావు,వాసు,వల్లెపు నాగేశ్వరావు, సాంబయ్య, వాడపల్లి నాని,శేషాద్రి,బాను, పాస్యం ప్రసాద్,తోలేం మల్లేశ్వరావు, మల్లేష్,రాములు,గాజుబోయిన లక్ష్మీనారాయణ, రూప రాంబాబు, అప్పన్న, దండి సాయి, పందేటి శ్రీను, కిన్నెర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## ఎయిరిండియాకు 'డీజీసీఏ' షోకాజ్ నోటీసులు

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంతో డైరెక్టరైట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా విమానాల్లో భద్రత, సిబ్బంది వ్యవహారాలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఎయిరిండియాకు తాజాగా నాలుగు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్యాబిన్ సిబ్బంది విశ్రాంతి, శిక్షణా నిబంధనలు, నిర్వహణ కార్యకలాపాలకు సంబంధించి ఉల్లంఘనలు జరిగిన అంశాన్ని ఎయిరిండియా అంగీకరించినట్టు తెలుస్తోంది. మరోవైపు భద్రతా ఉల్లంఘనలపై ఎయిరిండియాకు గత ఆరు నెలల్లో తొమ్మిది షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పౌరవిమానయాన శాఖ ఇటీవల రాజ్యసభలో వెల్లడించింది. ఒక ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే తాజాగా మరో నాలుగు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

## నటుడు దర్శన్‌కు బెయిల్..

### హైకోర్టుపై సుప్రీం ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరుచేయడంపై సుప్రీం కోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. న్యాయాధికారం దుర్వినియోగమైందని వ్యాఖ్యానించింది. హైకోర్టు చేసిన తప్పునే తాము పునరావృతం చేయబోమని ఆగ్రహం వ్యక్తంచేసింది. దోషిగా లేక నిర్దోషిగా ప్రకటించేందుకు తాము ఎలాంటి తీర్పును ఇప్పుడే ఇవ్వబోమని ప్రధాన నిందితురాలు పవిత్ర గౌడ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది. అరెస్టుకు తగిన ఆధారాలు లేవని బెయిల్ ఇచ్చినప్పుడు తీర్పు కాపీలో హైకోర్టు పేర్కొన్న భాషపైనా విచారం వ్యక్తం చేసింది. "ట్రయల్ కోర్టు ఇలాంటి పొరపాటు చేసిందంటే దానిని పరిగణనలోకి తీసుకోవచ్చు. కానీ ఒక హైకోర్టు న్యాయమూర్తి అలా చేయడం ఆమోదయోగ్యమైంది కాదు" అని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. వారం క్రితం కూడా ఈ కేసుపై సుప్రీంలో విచారణ జరిగింది. "వాస్తవంగా చెప్పాలంటే.. హైకోర్టు తన విచక్షణాధికారం ఉపయోగించిన తీరుతో మేం ఏకీభవించలేకపోతున్నాం. బెయిల్ రద్దు చేయాలని వాళ్లు కోరుతున్నారు. మీ క్లయింట్ బెయిల్‌పై ఉన్నందున మీ వాదన వింటాం. హైకోర్టు ఇచ్చిన తీర్పును మీరు చూసే ఉంటారు" అని దర్శన్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్‌ను ఉద్దేశిస్తూ జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. కర్ణాటకలో దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసు ఇటీవల సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అతడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్రగౌడ సహా 15 మందిని అరెస్టు చేశారు. నిందితులు రేణుకాస్వామిని అత్యంత పాశవికంగా కొట్టినట్లు తేలింది. అతడికి కరెంట్ షాకులు కూడా పెట్టినట్లు పోస్టుమార్టం నివేదికలో పేర్కొంది. హైకోర్టు దర్శన్‌కు గతేడాది అక్టోబర్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వగా.. డిసెంబర్ 13న కర్ణాటక హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.



## ముంబయి రైలు పేలుళ్లు..

### 12 మంది నిర్దోషులంటూ ఇచ్చిన తీర్పుపై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ :** దాదాపు రెండు దశాబ్దాల క్రితం 2006లో జరిగిన ముంబయి రైలు పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న 12 మందిని బాంబే హైకోర్టు ఇటీవల నిర్దోషులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై తాజాగా సుప్రీంకోర్టు స్టే విధించింది. అయితే, హైకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదలైన నిందితులను మళ్లీ అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 2006 జులై 11న ముంబయి పశ్చిమ రైల్వేలైన్‌లోని పలు సబర్బన్ రైళ్లలో వరుసగా బాంబు పేలుళ్లు చోటుచేసుకున్నాయి. యావత్ దేశాన్ని ఉలికిపాటుకు గురిచేసిన ఈ మారణహోమంలో 189 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 800 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు.. 12 మంది నిందితులను దోషులుగా తేల్చింది. వీరిలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణశిక్ష, మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. దోషుల్లో కమాల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పుర్ జైల్లోనే మృతి చెందాడు. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఆ 12 మందిని నిర్దోషులుగా తేల్చింది. వారిపై ఉన్న అభియోగాలను నిర్ధరించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైందని పేర్కొంది. ఎలాంటి పేలుడు పదార్థాలు వాడారన్నది నిరూపించలేకపోయారని తెలిపింది. దీంతో వారిని విడుదల చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ నిందితులకు నోటీసులు జారీ చేసింది.

## నకిలీ ఓటర్లను మేము ఎలా అనుమతిస్తాం? : ఈసీ




**న్యూఢిల్లీ :** బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల విమర్శలపై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తామంటూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థించుకుంది. ఈమేరకు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "మన దేశ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం తల్లి లాంటిది. దానికి అనుగుణంగానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాం. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశాం. విమర్శలు, వివాదాలకు భయపడి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మేం ఎలా పనిచేయగలం? చనిపోయిన ఓటర్ల పేరుతో నకిలీ ఓట్లను ఎలా అనుమతిస్తాం? శాశ్వతంగా వలస వచ్చిన వారు, రెండు ప్రాంతాల్లో ఓటు రిజిస్టర్ చేసుకున్న వారు, విదేశీయులతో ఎలా ఓటు వేయిస్తాం? పారదర్శక పనితీరు కోసం ప్రక్షాళన చేయకూడదా? రాజకీయ సిద్ధాంతాలకు అతీతంగా దేశ పౌరులంతా ఈ ప్రశ్నలపై పునరాలోచన చేయాలి" అని సీఈసీ తన ప్రకటనలో సూచించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ లో కీలక విషయాలు బయటపడ్డాయి. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని వెల్లడైంది. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఈసీ తెలిపింది. మరో ఏడు లక్షల మంది ఓటర్లు రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. ఇప్పటివరకు 7.68 కోట్ల మంది వివరాలను సేకరించినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఆగస్టు 1 నుంచి ముసాయిదా ఎన్నికల జాబితా ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇప్పటికే వీటికి సంబంధించిన వివరాలను రాష్ట్రంలోని 12 ప్రధాన పార్టీలతో పంచుకున్నామని, తద్వారా పేర్లను ఎందుకు తొలగించామో అందరికీ తెలుస్తుందని పేర్కొంది. సెప్టెంబర్ 1 వరకు సామాన్యులు సహా ఎవరైనా అభ్యంతరాలు తెలపవచ్చని సూచించింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని దుయ్యబట్టాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉంది.

## ఎడారి దేశంలో ఇసుక కొరత

### విదేశాల నుంచి దిగుమతి



**సౌదీ అరేబియా :** ఏడారి దేశం అనగానే చటుక్కున గుర్తొచ్చేది సౌదీ అరేబియా. ఆ దేశ భూభాగంలో 95 శాతం ఎడారే. అలాంటి దేశంలో ఇసుక కొరత అంటే ఆశ్చర్యంగా ఉంది కదూ. నిజమే.. సౌదీ అరేబియా ఇతర దేశాల నుంచి ఇసుకను దిగుమతి చేసుకుంటోంది. ఎందుకో తెలుసా..? అక్కడ లభించే ఇసుక నిర్మాణాలకు ఉపయోగపడకపోవడమే. విజన్ 2030లో భాగంగా సౌదీ అరేబియా భారీ కట్టడాలను నిర్మిస్తోంది. వీటికి అవసరమైన ఇసుకను ఆస్ట్రేలియా, చైనా, బెల్జియం దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. సౌదీ ఎదుర్కొంటున్న సమస్య భవిష్యత్‌లో మరిన్ని దేశాలకు వ్యాపించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

### ఎడారి ఇసుక ఎందుకు పనికిరాదు?

ఎడారిలో కనుచూపు మేరలో ఇసుకే కనిపిస్తుంది. కానీ, అందులో కొంచెం కూడా నిర్మాణాలకు వినియోగించలేం. ఎందుకంటే.. ఎడారి ఇసుక చాలా మృదువుగా ఉంటుంది. అంతేకాకుండా నిరంతరం వీచే గాలుల వల్ల కోతకు గురై.. ఇసుక రేణువులు గుండ్రంగా మారిపోతాయి. ఇలాంటి ఇసుకను సిమెంట్‌తో కలిపినా గట్టితనం రాదు. నిర్మాణాల్లో కరుకుగా, పలకలుగా ఉండే ఇసుకను వినియోగించడం ఉత్తమం. ఇలాంటి ఇసుక సాధారణంగా నదీ గర్భంలోనూ, సరస్సుల్లోనూ, లేదంటే సముద్ర గర్భంలో దొరుకుతుంది. అయితే, సముద్రంలోని ఇసుక లవణాలు కలిగి ఉండటం వల్ల చాలా మంది నిర్మాణాల్లో వినియోగించేందుకు వెనకడుగు వేస్తుంటారు.

### కీలక ఎగుమతిదారుగా ఆస్ట్రేలియా

ఓఈసీ (అబ్జర్వేటరీ ఆఫ్ ఎకనామిక్ కాంప్లెక్సిటీ) వరల్డ్ నివేదికల ప్రకారం.. ప్రపంచంలో కీలక ఇసుక ఎగుమతి దేశాల్లో ద్వీపదేశం ఆస్ట్రేలియా నిలిచింది. 2023లో అత్యధికంగా 273 మిలియన్ డాలర్ల విలువైన ఇసుకను విదేశాలకు ఎగుమతి చేసి.. రెండో అతిపెద్ద ఇసుక ఎగుమతిదారు దేశంగా నిలిచింది. తొలి స్థానంలో అమెరికా ఉంది. సౌదీ అరేబియా దాదాపు 140 మిలియన్ డాలర్ల ఇసుకను ఆస్ట్రేలియా నుంచి కొనుగోలు చేసింది. దీనిని ఎర్రసముద్రం, నియోమ్, క్విడ్డియా ప్రాజెక్టులకు వినియోగించింది.

### సౌదీ ఒక్కటే కాదు..!

కేవలం సౌదీ అరేబియా మాత్రమే ఇసుకను దిగుమతి చేసుకోవడం లేదు. ఆ జాబితాలో యునైటెడ్ ఎమిరేట్స్, ఖతార్ కూడా ఉన్నాయి. ఇటీవల దుబాయ్, అబుదాబి లాంటి నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీ మొత్తంలో ఇసుక కొరత ఏర్పడింది. భవనాలు బలంగా, ఎక్కువకాలం ఉండాలన్న ఉద్దేశంతో నాణ్యమైన ఇసుకను విదేశాల నుంచి దిగుమతి చేసుకొని నిర్మాణాల్లో వినియోగిస్తున్నారు.

### ఇసుక సంక్షోభం.. పెద్ద సమస్యే..!

ఇసుక సంక్షోభం కేవలం పశ్చిమాసియా దేశాలకే పరిమితం కావడం లేదు. యూఎన్‌ఈపీ నివేదిక ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 50 బిలియన్ టన్నుల ఇసుకను వినియోగిస్తున్నారు. భారీగా ఇసుక తవ్వకాలు చేపడితే.. కట్టడాలకు వినియోగించే ఇసుక పరిమాణం భవిష్యత్‌లో తగ్గిపోయే అవకాశం ఉంది. దీనినే ఇసుక సంక్షోభంగా నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య ప్రపంచ దేశాలన్నింటికీ విస్తరించకముందే.. జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు. ఇసుకకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని చెబుతున్నారు. రాళ్లను పిండి చేసి (ఎమ్-శాండ్) కట్టడాల్లో వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

## రూ.2.15 కోట్ల నగలు కొట్టేస్తే.. 'పావ్ భాజీ' పట్టించింది



**కర్ణాటక :** ఒక్కోసారి చిన్న చిన్న పొరపాట్లే.. భారీ కుంభకోణాలను, దొంగతనాలను బయటపెడుతుంటాయి. కర్ణాటకలోని కలబురిగిలో ఇదే తరహా ఘటనే చోటు చేసుకుంది. పావ్‌భాజీ తినాలన్న కోరిక.. దాదాపు రూ.2.15 కోట్ల దొంగతనాన్ని బయటపెట్టింది. జులై 11న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు తాజాగా వెల్లడించారు. కలబురిగిలోని మారాతుల్లా మాలిక్‌కు చెందిన బంగారు దుకాణంలో పట్టపగలే నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రధాన సూత్రధారి ఫరూక్ అహ్మద్ మాలిక్ దుకాణం బయట గమనిస్తుండగా.. మిగతా ముగ్గురూ మాస్కులు ధరించి లోపలికి వెళ్లి.. యజమాని కాళ్లు, చేతులు కట్టేసి.. తుపాకీతో బెదిరించి బలవంతంగా లాకర్ ఓపెన్ చేయించారు. డబ్బు, బంగారంతో అక్కడి నుంచి పరారయ్యారు.

### పట్టించిన పావ్ భాజీ!

మారాతుల్లా మాలిక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దుకాణం ముందున్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. లోపలి నుంచి వచ్చిన ముగ్గురు నిందితులు, బయట ఉన్న ఫరూక్ అహ్మద్ దగ్గరికి వచ్చి.. ఏదో మాట్లాడారు. అక్కడి నుంచి నలుగురూ కలిసి వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్లిన ఫరూక్ మళ్లీ వెనక్కి వచ్చి ప్లేట్ పావ్‌బాజీ తిన్నాడు. దుకాణదారుకు రూ.30 ఫోన్‌పే చేశాడు. అదే అతడిని పట్టించింది. ఆ లావాదేవీ ద్వారా ఫోన్ నెంబర్‌ను గుర్తించిన పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. దాదాపు 3 కిలోల బంగారం, కొంత నగదును దొంగిలించినట్లు అంగీకరించాడు. అయితే.. పోలీసులు మళ్లీ తన దుకాణంపైనే సోదాలు నిర్వహిస్తారేమోనన్న భయంతో కేవలం 805 గ్రాముల బంగారం, కొంత నగదు పోయినట్లు మారాతుల్లా ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. అతడిని కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఫరూక్ అహ్మద్ కూడా ఓ బంగారు దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే, వ్యాపారంలో దాదాపు రూ.40లక్షల వరకు నష్టపోయాడు. వాటి నుంచి బయటపడాలనే ఉద్దేశంతోనే.. ఇతర నేరగాళ్లతో జట్టు కట్టి దోపిడీకి పన్నాగం పన్నినట్లు పోలీసులు భావిస్తున్నారు. దోపిడీ జరిగిన వెంటనే కొంత బంగారాన్ని కరిగించినట్లు తెలుస్తోంది. నిందితుడి నుంచి 2.865 కేజీల బంగారు ఆభరణాలు, రూ.4.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలుకుదామన్న కాంగ్రెస్

### కేంద్రం మౌనం



**న్యూఢిల్లీ :** ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయనకు వీడ్కోలు పలకాలని కాంగ్రెస్ కోరగా, కేంద్రం స్పందించలేదని తెలుస్తోంది. గురువారం రాజ్యసభలో ఏడుగురు సభ్యులకు వీడ్కోలు కార్యక్రమం ఉంది. ఈనేపథ్యంలో బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్ ధన్‌ఖడ్‌కు కూడా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే, కేంద్రం దీనిపై స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా కూడా ఈ విషయంపై ఏం మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా.. జైరాం రమేశ్ డిమాండ్‌కు మిగిలిన ప్రతిపక్ష నేతల నుంచి కూడా ఎలాంటి మద్దతు లభించలేదని వెల్లడించారు. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో వీడ్కోలు కార్యక్రమంపై కేంద్రం స్పందించకపోవడం మరిన్ని ప్రశ్నలకు తావిస్తోంది. ఇక, సోమవారం ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు అనూహ్యంగా ప్రకటించారు. అనారోగ్య కారణాలతోనే వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, దీనివెనక ఏదో పెద్ద కారణం ఉందని ప్రతిపక్షాలు సందేహం వెలిబుచ్చాయి. అయినా వీటిపై కేంద్రం ఇప్పటివరకు స్పందించలేదు. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారమే ఆమోదించారు. కేంద్ర హోంశాఖ కూడా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం అటు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు ప్రారంభించింది.

## రోజుకు 7వేల అడుగులతో..

### డిప్రెషన్, డయాబెటిస్ ముప్పు దూరం : లాన్సెట్




**ఢిల్లీ:** నడక.. మిగతా వాటితో పోలిస్తే తేలికైన వ్యాయామం. మనం వేసే ప్రతి అడుగు ఆరోగ్యదాయిని అని, మన ఆయుష్షును పెంచుతుందని ఇప్పటికే ఎన్నో సార్లు ఎన్నో అధ్యయనాల్లో తేలింది. మరి ఆరోగ్యకర జీవనానికి రోజుకు ఎన్ని అడుగులు వేయాలి? మనలో చాలామందిలో మెదిలే ప్రశ్నే ఇది. అయితే, రోజుకు 7వేల అడుగులు వేస్తే ఆయుర్దాయం పెరుగుతుందని లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. క్యాన్సర్, డయాబెటిస్, డిప్రెషన్ లాంటి అనేక వ్యాధుల ముప్పు తగ్గుతుందని పేర్కొంది.

### లాన్సెట్ అధ్యయనంలోని అంశాలివే..

- రోజుకు 10వేల అడుగులు నడిస్తే ఆరోగ్యానికి చాలా మంచిదని గతంలో పలు అధ్యయనాలు తేల్చాయి. అయితే, అలా నడవలేనివారు రోజుకు 7వేల అడుగులు వేసినా గణనీయమైన ఆరోగ్యకర ప్రయోజనాలు ఉంటాయని లాన్సెట్ తెలిపింది.
- రోజుకు 7వేల అడుగులు వేయడం వల్ల మరణం ముప్పును తగ్గించుకోవచ్చు. రోజుకు 2 వేల అడుగులతో పోలిస్తే 7 వేల అడుగులు వేసే వారికి మరణ ముప్పు 47 శాతం తగ్గుతుంది.
- రోజుకు 7వేల అడుగులు వేసే వారిలో డిప్రెషన్ ముప్పు 22 శాతం, డిమెన్షియా ముప్పు 38శాతం, క్యాన్సర్ వచ్చే అవకాశం 6శాతం, క్యాన్సర్ మరణాల ముప్పు 37శాతం తగ్గుతుందని అధ్యయనంలో తేలింది.
- అంతేగాక, హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం 25 శాతం, టైప్ 2 డయాబెటిస్ ముప్పు 14 శాతం మేర తగ్గుతుందట.
- 2014 నుంచి 2025 మధ్య నిర్వహించిన 88 సర్వేల ఆధారంగా లాన్సెట్ ఈ అధ్యయనాన్ని ప్రచురించింది. ఈ సర్వేల్లో ప్రపంచవ్యాప్తంగా 1.6 లక్షల మంది పాల్గొన్నారు. యూకే, ఆస్ట్రేలియా, స్పెయిన్, నార్వే వంటి దేశాల్లోని పరిశోధకులు ఇందులో పాల్గొన్నారు.
- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు పెద్దవాళ్లలో ఒకరు వారి శరీర బరువుకు తగినంత ఫిజికల్ యాక్టివిటీ చేయట్లేదు. దీనివల్లే అనేక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. నడక అనేది ఆరోగ్యకర జీవనానికి చాలా అత్యవసరమని, ఈ విషయంపై విస్తృత ప్రచారం, అవగాహన కల్పించడం అవసరమని అభిప్రాయపడుతున్నారు.

## కంబోడియాలో 105 మంది భారతీయులు అరెస్టు



**న్యూఢిల్లీ :** సైబర్ నేరగాళ్లు, ఆన్‌లైన్ మోసగాళ్లను పట్టుకునేందుకు కంబోడియాలో పెద్దఎత్తున సోదాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 15 రోజుల పాటు 138 ప్రాంతాల్లో జరిగిన ఈ దాడుల్లో పలు దేశాలకు చెందిన 3 వేల మందికి పైగా వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలిసిం ది. అరెస్టయిన వారిని భారత్‌కు రప్పించేందుకు కంబోడియా అధికారులతో భారత ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. గత నెల కంబోడియా, భారత్‌ల మధ్య ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. భారత్ సహా పలు దేశాలకు చెందిన వ్యక్తులు కంబోడియా కేంద్రంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని న్యూదిల్లీ వివరించింది. ఇందుకు సంబంధించి కొంత కీలక సమాచారాన్ని కూడా ఆ దేశ అధికారులతో పంచుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కంబోడియా అధికారులు తాజాగా సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్న మొత్తం 20 దేశాలకు చెందిన 3,075 మందిని స్థానిక అధికారులు అరెస్టు చేశారు. వీరిలో భారత్‌తో పాటు చైనా, వియత్నాం, ఇండోనేషియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర దేశాలకు చెందిన వారున్నారు. అత్యధికంగా 1028 మంది చైనా పౌరులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద భారత్, చైనా పోలీసుల నకిలీ యూనిఫామ్‌లు, ఆయుధాలు, ఇతర నార్కోటిక్స్ ఉన్నట్లు గుర్తించారు. అరెస్టయిన భారతీయులను స్వదేశానికి రప్పించే ప్రక్రియ ప్రారంభించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్‌కు వ్యతిరేకంగా సైబర్ నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కంబోడియాలో ఉద్యోగాల పేరుతో యువకులను పిలిపించి.. అక్కడ వారితో సైబర్ నేరాలు చేయిస్తున్న ఘటనలు ఆ మధ్య వెలుగు చూసిన విషయం తెలిసిందే. అలా చిక్కుకుపోయిన యువకులను రక్షించేందుకు కూడా కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది.

# ఇంగ్లాండ్ మళ్లీ బజ్‌బాల్

## రెండో రోజు ముగిసిన ఆట



**మాంచెస్టర్:** ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 264/4తో ఆటను మొదలుపెట్టిన టీమ్ఇండియా.. 358 పరుగులకు ఆలౌటైంది. లార్డ్స్ టెస్టులో బ్యాటింగ్‌లో దూకుడుకు దూరంగా ఇంగ్లాండ్.. ఈ మ్యాచ్‌లో మళ్లీ బజ్‌బాల్ అస్త్రాన్ని బయటికి తీసింది. ఓపెనర్లు బెన్ డకెట్ (94, 100 బంతుల్లో 13 ఫోర్లు), జాక్ క్రాలీ (84, 113 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగి ఆడారు. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటైనా రెండో రోజును ఇంగ్లాండ్ సంతృప్తికరంగానే ముగించింది. ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఓలీ పోప్ (20), జో రూట్ (11) క్రీజులో ఉన్నారు. రవీంద్ర జడేజా, అన్షుల్ కాంబోజ్ తలో వికెట్ పడగొట్టారు. ఇంగ్లిష్ జట్టు ఇంకా 133 పరుగుల వెనుకంజలో ఉంది.

### డకెట్, క్రాలీ దూకుడు

డకెట్, క్రాలీ జోడీ ఇంగ్లాండ్‌కు అదిరే ఆరంభం ఇచ్చింది. తొలుత క్రాలీ నెమ్మదిగా ఆడగా.. డకెట్ దూకుడుగా ఆడాడు. అన్షుల్ కాంబోజ్ వేసిన మొదటి ఓవర్‌లో మూడు ఫోర్లు బాదిన డకెట్.. బుమ్రా బౌలింగ్‌లో రెండు బౌండరీలు రాబట్టాడు. క్రమంగా క్రాలీ కూడా జోరందుకోవడంతో 77/0తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు మరింత చెలరేగారు. 32 ఓవర్లు ఆడి 2 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. డకెట్ 46 బంతుల్లో, క్రాలీ 73 బంతుల్లో అర్ధ శతకాలు అందుకున్నారు. తర్వాత కూడా నిలకడగా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించిన వీరు సెంచరీలు చేసేలా కనిపించారు. అయితే, జడేజా బౌలింగ్‌లో క్రాలీ బంతిని డిఫెండ్ చేయ-ంబోగా బాల్ బ్యాట్ ఎడ్జ్‌కు తగిలింది. స్లిప్‌లో ఉన్న రాహుల్ ఏ మాత్రం పొరపాటు చేయకుండా బంతిని ఒడిసిపట్టడంతో 166 పరుగుల భాగమ్యానికి తెరపడింది. అయినా, డకెట్ దూకుడు తగ్గించలేదు. సిరాజ్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు బాది సెంచరీకి చేరువయ్యాడు. కానీ, డకెట్.. అన్షుల్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయి వికెట్‌కీపర్ జురెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత ఓలీ పోప్, రూట్ రిస్కీ షాట్ల జోలికి వెళ్లకుండా జాగ్రత్తగా ఆడి మరో వికెట్ పడకుండా చూసుకున్నారు.

భారత్ బ్యాటింగ్ విషయానికొస్తే.. రెండో రోజు ఆటలో టీమ్ఇండియా 94 పరుగులు చేసి చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. ఓవర్ నైట్ స్కోరు 19తో ఆటను మొదలుపెట్టిన శార్దూల్ ఠాకూర్ (41, 88 బంతుల్లో 5 ఫోర్లు) రాణించాడు. రవీంద్ర జడేజా (20) (ఓవర్‌నైట్ స్కోరు 19) తొందరగానే వెనుదిరిగాడు. వాషింగ్టన్ సుందర్ (27, 90 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. శార్దూల్, సుందర్ ఆరో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం (101 బంతుల్లో) నెలకొల్పారు. తొలి రోజు కాలికి గాయమవడంతో 37 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మైదానాన్ని వీడిన రిషబ్ పంత్ (54, 75 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి అర్ధ శతకం చేశాడు. మొదటి రోజు యశస్వి జైస్వాల్ (58), కేఎల్ రాహుల్ (46), సాయి సుదర్శన్ (61) రాణించిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్‌స్టోక్స్ (5/72) రాణించాడు. జోఫ్రా ఆర్చర్ 3, క్రిస్ వోక్స్, లియామ్ డాసన్ తలో వికెట్ తీసుకున్నారు.



## ఇంగ్లాండ్‌లో టీమ్ఇండియా టూర్ షెడ్యూల్ విడుదల

పరిమిత ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణలో భాగంగా టీమ్ఇండియా 2026లో ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా భారతజట్టు ఇంగ్లాండ్‌తో 5 టీ20లు, 3 వన్డేలు ఆడనుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ తాజాగా విడుదల చేసింది. తొలి టీ20 జులై 1న దర్హామ్, రెండో టీ20 జులై 4న మాంచెస్టర్, మూడో టీ20 జులై 7న నాటింగ్‌హామ్, నాలుగో టీ20 జులై 9న బ్రిస్టల్, అయిదో టీ20 జులై 11న సౌతాంప్టన్ వేదికగా జరగనున్నాయి. అలాగే మొదటి వన్డే జులై 14న బర్మింగ్‌హామ్, రెండో వన్డే జులై 16న కార్డిఫ్, మూడో వన్డే జులై 19న లార్డ్స్ వేదికగా నిర్వహించనున్నారు. అలాగే ప్రస్తుతం టీమ్ఇండియా.. తెందూల్కర్- అండర్సన్ ట్రోఫీ నేపథ్యంలో ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఐదు టెస్ట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఇప్పటికే మూడు టెస్ట్ మ్యాచ్‌లు ముగియగా రెండింట్లో ఇంగ్లాండ్, ఒకదానిలో టీమ్ఇండియా విజయం సాధించాయి. ప్రస్తుతం మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది.



## ట్రేడ్ డీల్‌తో.. స్కాచ్ విస్కీ
# కార్ల ధరలు తగ్గనున్నాయా?

భారత్, బ్రిటన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, పెట్టుబడులు పెంచడమే లక్ష్యంతో ఇరు దేశాలు చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం పేరుతో చేసుకున్న ఈ ఒప్పందం అనేక రంగాల్లో దోహదం చేయనుందని నిపుణుల అంచనా. ముఖ్యంగా ఇరు దేశాలు పరస్పరం దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను తగ్గించడంతోపాటు పలు వస్తువులను మార్కెట్‌లో స్వేచ్ఛగా విక్రయించేందుకు మార్గం సుగమం చేయడం ప్రధాన అంశంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకొనే కొన్ని వస్తువుల ధరలు తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. భారత్ ఎగుమతి చేసే శ్రామిక ఆధారిత ఉత్పత్తులపై సుంకాలు తగ్గుతాయి. లెదర్, పాదరక్షలు, జౌళి వంటి ఎగుమతి చేసే ఉత్పత్తులు, బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకునే స్కాచ్ వీస్కీ, కార్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. స్కాచ్ విస్కీపై ప్రస్తుతం దిగుమతి సుంకం 150శాతం ఉంది. దీన్ని తొలుత 75శాతానికి తగ్గించనుండగా.. వచ్చే పదేళ్ల నాటికి 40శాతానికి తగ్గిస్తారు. దీంతో ధరలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ అవి ఏ మేరకు తగ్గుతాయనే విషయం ఆయా రాష్ట్రాల మద్యం విధానంపై ఆధారపడి ఉంటుంది. సాఫ్ట్‌డ్రింక్స్, కాస్మొటిక్స్, చాక్లెట్లు, బిస్కెట్లు, వైద్య పరికరాలను బ్రిటన్ కంపెనీలు మన దేశంలో తేలికగా విక్రయించే అవకాశం ఉంది. వీటి ధరలు కూడా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కార్లపై విధిస్తున్న 100శాతం సుంకాలను ఇరు దేశాలు 10శాతానికి తగ్గించనున్నాయి. దీంతో రానున్న రోజుల్లో వీటి ధరలు తగ్గే అవకాశం ఉంది. భారత్ నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే వస్తువులపైనా బ్రిటన్ సుంకాలు తగ్గించనుంది. బంగారు నగలు, వజ్రాలు, లెదర్, వస్త్రాలు, పాదరక్షలుపై సుంకాలు తగ్గనుండగా.. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, బాస్మతి బియ్యం, టీ, మసాలాలను ఇంగ్లండ్ మార్కెట్‌లో స్వేచ్ఛగా విక్రయించే వీలు కలుగుతుంది. ఈ ఒప్పందం ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణకు దోహదపడుతాయని ఇరు దేశాల ఆశిస్తున్నాయి. ఐటీ, అనుబంధ రంగాలు, ఆర్థిక సేవలు, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ఆర్కిటెక్చరల్, ఇంజినీరింగ్ రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు వ్యాపార, విద్యాపరమైన రంగాల్లో నైపుణ్య శిక్షణకు అవకాశాలు మెరుగవుతాయని అంచనా.




## ఫిజిక్స్‌వాలా సహా 7 కంపెనీల
# ఐపీఓలకు సెబీ గ్రీన్ సిగ్నల్

**దిల్లీ:** మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు తాజాగా 7 కంపెనీలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ ఫిజిక్స్‌వాలా, సాత్విక్ గ్రీన్ ఎనర్జీ, వినిర్ ఇంజినీరింగ్, ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్, ఫుజియామా పవర్ సిస్టమ్స్, ఎస్ఐఎస్ క్యాష్ సర్వీసెస్, అన్‌లాన్ హెల్త్‌కేర్ ఉన్నాయి. ఈ కంపెనీలు 2024 జనవరి- ఏప్రిల్ మధ్య తమ ప్రాథమిక ఐపీఓ పత్రాలు దాఖలు చేయగా.. జులై 14 నుంచి 18 మధ్య సెబీ అనుమతులు మంజూరు చేసింది. గౌడియం ఐవీఎఫ్ అండ్ ఉమెన్ హెల్త్ సంస్థ జనవరిలో ఐపీఓ పత్రాలు దాఖలు చేసినప్పటికీ తర్వాత వాటిని వెనక్కి తీసుకున్నట్లు సెబీ వెల్లడించింది.

# పన్ను చెల్లింపుదారులపై.. ఐటీ 'ఏఐ' నజర్

**పన్ను చెల్లింపుదారులు నిబంధనలు పాటించేందుకు, ఐటీ రిటర్నుల విషయంలో వారికి సరైన దిశానిర్దేశం చేసేందుకు, తప్పుడు వ్యవహారాలను గుర్తించేందుకు ఆదాయపు పన్ను విభాగం తన చర్యలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే కృత్రిమ మేధ సాయంతో.. పన్ను చెల్లింపుదారుల తీరుతెన్నులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ ఛైర్మన్ రవి అగర్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పన్ను చెల్లింపుదారులు సరైన నిబంధనలు పాటించేలా ఐటీ విభాగం వారి ఆన్‌లైన్ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, రిటర్న్ ఫైలింగ్ నమూనాలను విశ్లేషిస్తున్నట్లు సమాచారం.**

### 'ఏఐఎస్' యాక్సెస్‌పై దృష్టి..

పన్ను చెల్లింపుదారులు, సంస్థల ఆర్థిక లావాదేవీల గురించి 'వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)'లో పూర్తి వివరాలు ఉంటాయి. ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు కచ్చితమైన సమాచారం అందించేందుకు ఇది సాయపడుతుంది. ఈ నేపథ్యంలోనే ఓ యూజర్ ఎన్నిసార్లు తన 'ఏఐఎస్'ను యాక్సెస్ చేస్తున్నారనే దానిపై అధికారులు దృష్టిసారించారు. పన్ను చెల్లింపుదారులు సగటున 3.5 సార్లు ఏఐఎస్ పోర్టల్‌ను సందర్శించినట్లు తేలింది. 650 కోట్లకుపైగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి 40 కోట్ల ఏఐఎస్ డాక్యుమెంట్లు జెనరేట్ అయినప్పటికీ.. గతేడాది కేవలం 9 కోట్ల టాక్స్ రిటర్నులు మాత్రమే దాఖలయ్యాయి. రిటర్ను దాఖలు చేయకుండా తరచూ ఏఐఎస్‌ను యాక్సెస్ చేయడమనేది.. ఫైలింగ్‌లో ఇబ్బందులను, లేదా పన్ను చెల్లింపుదారుల ఇతర ఉద్దేశాలను సూచిస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే వారికి సాయం చేసేందుకు, ఈమె-యిల్/మెసేజ్‌ల ద్వారా చర్యలు తీసుకునేందుకు ఇది వీలు కల్పిస్తోంది.




### మోసాలను గుర్తించేందుకు..

భారీ లావాదేవీల విషయంలో రిటర్నులు దాఖలు చేయని, లేదా ఫైలింగ్‌లో పదేపదే తప్పులు చేసేవారిని గుర్తించేందుకు 'ఏఐ' ఆధారిత డేటా విశ్లేషణను ఐటీ విభాగం ఉపయోగిస్తోంది. అదేవిధంగా పన్ను మినహాయింపులు, తగ్గింపులకు సంబంధించిన తప్పుడు క్లెయిమ్‌లను కూడా ఈ వ్యవస్థ గుర్తిస్తోంది. ఇటువంటి మోసపూరిత వ్యవహారంతో ముడిపడి ఉన్న 1.5 లక్షలకు పైగా పాన్‌లను ఇప్పటికే గుర్తించింది. అయితే.. ఈ కేసులు ప్రధానంగా మధ్యవర్తులు తప్పుదోవ పట్టించడం వల్లే జరిగినట్లు భావిస్తున్నామని ఆ విభాగం పేర్కొంది.

### స్వచ్ఛందంగా నిబంధనలు పాటించేలా..


పన్ను చెల్లింపుదారులు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించేలా ఐటీ విభాగం తగు వ్యూహాలను అమలు చేస్తోంది. ఓ సందర్భంలో 'ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్' కింద అందిన విదేశీ ఆస్తుల సమాచారం ఆధారంగా 19,501 మంది పన్ను చెల్లింపుదారులను అధికారులు సంప్రదించారు. ఫలితంగా వారిలో 62 శాతం మంది తమ రిటర్న్‌లను అప్‌డేట్ చేశారు. రూ.29,208 కోట్ల విలువైన విదేశీ ఆస్తులను, రూ.1,089 కోట్ల విదేశీ ఆదాయాన్ని వెల్లడించడం గమనార్హం. అదేవిధంగా.. సెక్షన్ 80జీజీసీ కింద రూ.9,000 కోట్ల అదనపు క్లెయిమ్‌లను అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఈమెయిల్, మెసేజ్‌ల ద్వారా సూచనలు జారీ చేస్తూ.. ఈ క్లెయిమ్‌లను రూ.963 కోట్ల మేర తగ్గించారు. రూ.409.5 కోట్ల అదనపు పన్ను చెల్లింపులు రాబట్టారు. ఈ ఏడాది జూన్ 18 నాటికి దాదాపు 89 లక్షల అప్‌డేటెడ్ రిటర్నులు దాఖలయ్యాయి. రూ.9,577.06 కోట్ల అదనపు పన్ను ఆదాయం సమకూరింది.

### అవగాహన కల్పించేందుకే..

డిజిటల్ సహకారాన్ని ఐటీ విభాగం ముమ్మరం చేస్తున్నప్పటికీ.. పన్ను చెల్లింపుదారులు అందించే తప్పుడు, తాత్కాలిక వివరాలు సవాల్‌గా మారుతున్నాయి. చాలా మెయిళ్లు, చిరునామాలు ఏజెంట్లు లేదా మధ్యవర్తులకు చెందినవిగా తేలుతున్నాయి. కమ్యూనికేషన్ సజావుగా సాగేందుకు, సేవల ప్రభావాన్ని మెరుగుపరిచేందుకు సరైన వివరాలు ఇవ్వాల్సిన ఆవశ్యకతను సీబీడీటీ ఛైర్మన్ అగర్వాల్ చెప్పారు. ఈ చర్యలన్నీ పన్ను చెల్లింపుదారులను శిక్షించేందుకు కాదని.. వారిలో అవగాహన పెంచేందుకు, సరైన ఫైలింగ్‌లను ప్రోత్సహించేందుకేనని సీబీడీటీ చెబుతోంది.

# భారతీయులను నియమించుకోవద్దు

## టెక్ కంపెనీలకు ట్రంప్ హెచ్చరిక




**వాషింగ్టన్ :** గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ టెక్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడం ఆపి.. అమెరికన్లపై దృష్టిపెట్టాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలమైన సందేశం పంపారు. ఆయన బుధవారం వాషింగ్టన్ డీసీలో జరిగిన ఏఐ సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్ కంపెనీల గ్లోబలిస్ట్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. చాలామంది అమెరికన్లు తమను పట్టించుకోవడం లేదన్న భావనలో ఉన్నట్లు పేర్కొన్నారు. దేశంలో లభించిన స్వేచ్ఛను వాడుకొని చాలా టెక్ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. తన పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయని చెప్పారు. "మన దేశంలోని చాలా భారీ టెక్ కంపెనీలు చైనాలో కంపెనీలు నిర్మిస్తూ.. భారతీయ ఉద్యోగులను నియమించుకొంటూ.. ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకొని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవించాయి. ఆ విషయం మీకు తెలుసు. ఇక్కడి ప్రజల అవకాశాలను పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యం చేయడం వంటివి చేశారు. ట్రంప్ పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయి. ఏఐ రేసులో విజయం సాధించాలంటే సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరం. ఇక్కడ ఉన్న టెక్నాలజీ కంపెనీలు మొత్తం అమెరికా కోసమే. దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తూ పనిచేయాలి. మీరూ అది చేయాలి. అదే నేను కోరుతున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సదస్సులో ట్రంప్ కృత్రిమ మేధకు సంబంధించి మూడు కీలక ఆదేశాలపై సంతకాలు చేశారు. ఏఐకు ఉన్న ఆటంకాలను తొలగించడం.. అభివృద్ధిని వేగవంతం చేయడం, ఇక ప్రభుత్వ నిధులు పొందుతున్న సంస్థలు తయారుచేసే ఏఐ టూల్స్ రాజకీయంగా తటస్థ వైఖరితో ఉండేలా చూడటం వంటి అంశాలున్నాయి.

## ఎట్టకేలకు ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ..
# జులై 30 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం

డిపాజిటరీ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ ఎట్టకేలకు తొలి పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఆర్థిక, సెక్యూరిటీల మార్కెట్లలో అనేక ఉత్పత్తులు, సేవలను అందిస్తున్న ఈ సంస్థ ఐపీఓ జులై 30న ప్రారంభం కానుంది. మొత్తం రూ.4 వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఆగస్టు 1తో పబ్లిక్ ఇష్యూ ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు జులై 29నే బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది. ధరల శ్రేణి ఇంకా వెల్లడి కావాల్సిఉంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరుగుతుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా తమ తమ వాటాలను తగ్గించుకోనున్నాయి. మొత్తం 5.01 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్ రూపంలో విక్రయించనున్నారు. దీనివల్ల ఎన్ఎస్‌డీఎల్‌కు ఒక్క రూపాయి కూడా రాదు. దేశంలో అతిపెద్ద డిపాజిటరీగా ఉన్న ఎన్ఎస్‌డీఎల్ గతేడాది అక్టోబర్‌లోనే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు పొందింది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ 2017లోనే ఎన్ఎస్ఈలో లిస్టయ్యింది. ఇప్పుడు లిస్టింగ్‌కు వస్తున్న రెండో సంస్థ ఇది. డిపాజిటరీ కంపెనీలో ఏ ఒక్క సంస్థా 15 శాతానికి మించి వాటాలు ఉండకూడదన్న సెబీ నిబంధనల నేపథ్యంలో ఆయా కంపెనీలు వాటాలు తగ్గించుకుంటున్నాయి. ఐడీబీఐకి 26.10 శాతం, ఎన్ఎస్ఈకి 24 శాతం చొప్పున ప్రస్తుతం వాటా ఉంది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, ఐడీబీఐ క్యాపిటల్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ సంస్థలు ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎన్ఎస్‌డీఎల్ నికర లాభం రూ.343 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.1,535 కోట్లుగా నమోదైంది. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న ఐపీఓ కావడంతో దీనిపై మదుపర్లలోనూ ఆసక్తి నెలకొంది. దీంతో గూగుల్ ట్రెండ్స్‌లోనూ ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ గురించి నెటిజన్లు ఆరా తీస్తున్నారు.

# సెన్సెక్స్ 542 పాయింట్లు డౌన్

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీనికితోడు భారత్-అమెరికా మధ్య ట్రేడ్‌డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడం, విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన క్యూ1 ఫలితాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 650కి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 25,100 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,779.95 (క్రితం ముగింపు 82,726) పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. క్షణాల్లోనే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 82,047.22 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 542.47 పాయింట్ల నష్టంతో 82,184.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.80 పాయింట్ల నష్టంతో 25,062 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.41గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, టైటాన్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. మిగిలిన షేర్లన్నీ నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69 డాలర్ల వద్ద కొనసాగుతు ఒడగా.. బంగారం ఔన్సు 3,367 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# అనిల్ అంబానీ ఆఫీసుల్లో ఈడీ సోదాలు



**ముంబయి :** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. దిల్లీ, ముంబయిలోని ప్రాంగణాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నాయి. రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డాయన్న ఆరోపణలపై ఈడీ ఈ సోదాలు చేపట్టింది. అయితే, అనిల్‌కు చెందిన వ్యక్తిగత నివాసానికి మాత్రం ఈడీ అధికారులు వెళ్లలేదని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దిల్లీ, ముంబ యి నుంచి వచ్చిన దర్యాప్తు సంస్థ బృందాలు 35 ప్రదేశాల్లో ఈ తనిఖీలు చేస్తున్నాయి. ఇప్పటివరకు 25 మందిని ప్రశ్నించారు. ఈడీ ప్రాథమిక నివేదిక ప్రకారం.. 2017 నుంచి 2019 మధ్యకాలంలో యెస్ బ్యాంక్ నుంచి తీసుకు న్న రూ.3 వేల కోట్ల రుణాలను అనిల్ అంబానీ కంపెనీలు అనుమానాస్పద రీతిలో దారి మళ్లించాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇదే అంశంలో యెస్ బ్యాంక్ మాజీ ఎండీ ప్రమోటర్ రాణా కపూర్‌పై దాఖలైన మనీలాండరింగ్ కేసులో భాగంగా 2020లో అనిల్ అంబానీ ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ప్రజాధనాన్ని స్వాహా చేశారని ఈడీ తన ప్రాథమిక దర్యాప్తు పేర్కొంది. ఈ నేపథ్యంలో నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడాతో సహా పలు నియంత్రణ, ఆర్థిక సంస్థల నుంచి వచ్చిన సమాచారం, అలాగే సీబీఐ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ తాజాగా రంగంలోకి దిగింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని 'మోసపూరితం'గా వర్గీకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించిన వేళ.. ఈడీ రంగంలోకి దిగడం గమనార్హం.

# వీరమల్లు.. వన్ మేన్ షో



**పవన్‌కల్యాణ్ సినిమా అంటే అభిమానులకే కాదు, బాక్సాఫీస్‌కూ అదో పెద్ద పండగ. అందుకే ఆ పండగ ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తారు. సుదీర్ఘ విరామం తర్వాత పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. పవన్ కెరీర్‌లో నటిస్తున్న తొలి పీరియాడిక్ మూవీ కావడం, ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా పవన్ స్వయంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆ అంచనాలు పెరిగాయి. మరి వాటిని 'వీరమల్లు' అందుకున్నాడా? తెరపై ఎలాంటి మేజిక్ చేశారు?**

16వ శతాబ్దంలో మొదలయ్యే కథ ఇది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు (బాబీ దేవోల్) దిల్లీ పీఠంపై కూర్చొని ఎన్నెన్నో దురాగతాలకి పాల్పడుతూ పాలన కొనసాగిస్తుంటాడు. మత మార్పిడి కోసం దేశ ప్రజలని బలవంతం చేస్తుంటాడు. అందుకు ఒప్పుకోకుండా హిందువులుగానే జీవించేవాళ్ల నుంచి జిజియా పన్ను వసూలు చేస్తుంటాడు. మరోపక్క ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా, వాళ్లని పట్టించుకోకుండా దేశ సంపదని తెల్లదొరలు దోచుకెళ్తుంటారు. వాళ్లకు అనుకూలంగా కొద్దిమంది రాజులు, వాళ్ల అనుచరులు పనిచేస్తూ ఉంటారు. వాళ్లందరికీ వీర మల్లు (పవన్ కల్యాణ్) అంటే హడల్. పెద్దవాళ్ల దగ్గరున్న సంపదని దోపిడీ చేసి పేదలకి పంచిపెడుతుంటాడు. బందరు నుంచి హైదరాబాద్ నవాబ్ కుతుబ్ షాహీ దగ్గరకు తీసుకెళుతున్న వజ్రాలపై కన్నేస్తాడు వీరమల్లు. తన బలగంతో చార్మినార్ వరకూ వచ్చి మరీ వజ్రాల్ని కాజేస్తాడు. అతని వీరత్వం గురించి తెలుసుకున్న కుతుబ్ షాహీ దిల్లీలో ఔరంగజేబు సింహాసనంపై ఉన్న కోహినూర్ వజ్రాన్ని తీసుకొచ్చే బాధ్యతని అతడికి అప్పజెబుతాడు. ఏ కారణాలతో అందుకు వీరమల్లు ఒప్పుకున్నాడు?హైదరాబాద్ నుంచి దిల్లీకి వెళ్లే క్రమంలో ఆయనకి ఎదురైన పరిస్థితులు ఎలాంటివి?ఈ కథలో పంచమి (నిధి అగర్వాల్) ఎవరు?ఆమెకీ వీరమల్లుకూ సంబంధం ఏమిటి?శత్రుదుర్భేధ్యమైన ఔరంగజేబు సామ్రాజ్యంలోకి వీరమల్లు ఎలా వెళ్లాడు?తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

### ఎలా ఉందంటే...

ఒక సినిమా కొన్ని నెలలు ఆలస్యమైనా ఔట్ డేటెడ్‌గా మారిపోయే కాలం ఇది. కథ, కథనాలు వర్తమాన పరిస్థితులకి అద్దం పడతాయో లేదో అనే సందేహాలు, భయాలు వ్యక్తం కావడం సహజం. అలాంటిది ఐదేళ్లకుపైగా ఈ సినిమా సెట్స్‌పై ఉంది. అయితే చారిత్రాత్మక నేపథ్యం కారణంగా ఈ కథకి అలాంటి ఇబ్బందేమీ కలగలేదు. పైపెచ్చు ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్న సనాతన ధర్మం నేపథ్యాన్ని ఇందులో బలంగా స్పృశించారు. రాబిన్‌హుడ్ తరహా కథానాయకుడి పాత్రతోనూ, అభిమానుల్లో పూనకాలు తెప్పించే ఎలివేషన్స్‌తోనూ... ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యే స్వధర్మం నేపథ్యంతోనూ తెరకెక్కడం ఈ సినిమాకి కలిసొచ్చాయి. ఇందులోని కథేమిటో కథానాయకుడు పవన్ కల్యాణ్ గత కొన్ని రోజులుగా జరుగుతూ వచ్చిన ప్రతి వేడుకలోనూ చెబుతూ వచ్చారు. కథానాయకుడు కోహినూర్ కోసం దిల్లీకి వెళ్లే క్రమంలో ఎదురయ్యే పరిస్థితులే ఇందులో కీలకం. వీరమల్లు పాత్రని, అతని వీరత్వాన్ని పరిచయం చేస్తూ సాగే

**రివ్యూ**

ప్రథమార్ధం సినిమాకి హైలైట్ కాగా, ద్వితీయార్ధానికి ప్రీ క్లైమాక్స్ ప్రధానబలం.

16వ శతాబ్దం నాటి పరిస్థితులకు అద్దం పడుతూ ఈ సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. తన్నుకుపోవాల్సిన గద్ద ఛత్రం పట్టగా ఓ కుటుంబం ఒడికి చేరిన చిన్నారిగా కథానాయకుడు పరిచయం అవుతాడు. అక్కడ్నుంచి సినిమా పరుగులు పెడుతుంది. ప్రథమార్ధంలో యాక్షన్ సీక్వెన్స్, పాటలు సినిమాకి ప్రధాన ఆకర్షణ. ముఖ్యంగా పోర్ట్‌లో ఫైట్, అందులో ఎలివేషన్స్ అభిమానులని మరింతగా అలరిస్తాయి. ఆ తర్వాత మల్లయోధులతో, కొనసాగింపుగా చార్మినార్ దగ్గర సాగే పోరాట సన్నివేశాలతోనూ, 'కొల్లగొట్టినాదిరో' పాటతోనూ ఫస్ట్ హాఫ్ సినిమా అంచనాలకి దీటుగానే సాగుతుంది. విరామానికి ముందు కుతుబ్ షాహీ కోటలోని సన్నివేశాలు మరింతగా అలరించడంతోపాటు, ద్వితీయార్ధంపై మరింతగా ఆసక్తిని రేకెత్తిస్తాయి. అయితే, ఆ ఆసక్తికి తగ్గట్టుగా తర్వాత కథ, కథనాలు లేకపోవడంతోపాటు, చాలా సన్నివేశాలు సాగదీతగా అనిపిస్తాయి. పవన్ కల్యాణ్ స్వయంగా తీర్చిదిద్దిన యాక్షన్ ఎపిసోడ్ నుంచి మళ్లీ సినిమా గాడిలో పడుతుంది. యాక్షన్ ఘట్టాలతో పాటు, అక్కడ సనాతన ధర్మం నేపథ్యంలోని సన్నివేశాలు సినిమాకి ఆయువుపట్టు. అయితే పతాక సన్నివేశాల్లో ఆంధీ నేపథ్యం అభిమానులకి మరింత జోష్ నింపేలా ఉంటుందనుకుంటే, విజువల్స్‌తో మాయ చేసి తొలి భాగం సినిమాని ముగించారు. రెండో భాగం యుద్ధభూమిగా రూపొందనుంది. అసలైన యుద్ధం అప్పుడే చూడాలంటూ కథను ముగించారు.

### ఎవరెలా చేశారంటే..

పవన్‌కల్యాణ్ నటించిన తొలి పీరియాడిక్ డ్రామా సినిమా ఇది. ట్రెండీగా సాగే కథలు, పాత్రల్లోనే ఎక్కువగా కనిపించిన ఆయన ఈ తరహా కథలో, అది కూడా ఓ యాక్షన్ డ్రామాలో ఎలా కనిపిస్తారోననే సందేహాలు ఉండేవి. కానీ, వాటన్నిటినీ పటాపంచలు చేస్తూ హరి హర వీర మల్లు పాత్రలో ఒదిగిపోయారు. వీరమల్లుగా ఆయన కనిపించిన విధానం, అందులో చూపించిన హీరోయిజం, ఆయన చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకి ప్రాణం పోశాయి. సుదీర్ఘకాలంపాటు సినిమా సాగినా లుక్ పరంగా ఏమాత్రం వ్యత్యాసం కనిపించలేదు. క్రూరమృగాల నేపథ్యంలో వచ్చే సన్నివేశాల్లోనూ, సనాతన ధర్మం ఇతివృత్తంగా సాగే సన్నివేశాల్లో ఆయన భావజాలమే కనిపిస్తుంది. నిధి అగర్వాల్ పంచమి పాత్రలో ఆకట్టుకుంటుంది. కొల్లగొట్టినాదిరో, తార తార పాటల్లో మరింత అందంగా కనిపించింది. ఆమె లుక్‌లో కూడా తేడాలేమీ కనిపించలేదు. ఔరంగజేబు పాత్రలో బాబీ దేవోల్ కనిపించిన తీరు ఆకట్టుకుంటుంది. అయితే ప్రథమార్ధంలో కనిపించినంత బలంగా ద్వితీయార్ధంలో ఆ పాత్రని చూపించలేకపోయారు. దివంగత నటుడు కోట శ్రీనివాసరావు చిన్న పాత్రలో మెరుస్తారు. మురళీశర్మ, సచిన్ ఖేడ్కర్, సత్యరాజ్ తదితరులు అలవాటైన పాత్రల్లో కనిపిస్తారు. సునీల్, నాజర్, సుబ్బరాజు, అయ్యప్ప శర్మ, కబీర్ దుహాన్ సింగ్ తదితరులు పవన్‌కల్యాణ్ జట్టుగా కనిపిస్తారు. అనసూయ, పూజిత పొన్నాడ ఓ పాటలో సందడి చేస్తారు. సాంకేతిక విభాగాల్లో కీరవాణి సంగీతం ప్రధానం. నేపథ్య సంగీతంతో సినిమాకి ప్రాణం పోశారు. సంగీతంతోనే హీరోయిజాన్ని పతాక స్థాయిలో నిలబెట్టారు. పాటలు కూడా బాగున్నాయి. ఇద్దరు సినిమాటోగ్రాఫర్లు ఈ సినిమాకి పనిచేశారు. జ్ఞానశేఖర్, మనోజ్ పరమహంస విజువల్స్ ఆకట్టుకుంటాయి. కళా దర్శకుడు తోట తోరణి వర్క్ ప్రతి సన్నివేశంలోనూ కనిపిస్తుంది. దర్శకులుగా క్రిష్, జ్యోతికృష్ణ ఇద్దరు పనిచేసినా చెప్పాలనుకున్న కథ, కథనాలపై స్పష్టత ప్రదర్శించారు. 'జనం మెచ్చే సైనికుడు అవుతాడు... జనసైనికుడు అవుతాడు', 'పాలించేవారి పాదాలే కాదు, తల కూడా కనిపించాలి' అంటూ పవన్ రాజకీయ జీవితం, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఇందులో మాటలు రాశారు సాయిమాధవ్ బుర్రా అండ్ కో. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

## అతడిని క్షమించకూడదు..

### రిసెప్షనిస్ట్‌పై దాడిపై జాన్వీకపూర్ పోస్ట్



మహారాష్ట్రలోని థాణె జిల్లాలో ఆసుపత్రిలోని రిసెప్షనిస్ట్‌పై ఓ వ్యక్తి అమానుషంగా దాడి చేసిన ఘటన తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై బాలీవుడ్ నటి జాన్వీకపూర్ స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నిందితుడిని ఎప్పటికీ క్షమించకూడదని, అతడిని జైలుకు పంపించాలని అన్నారు. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. "ఇలాంటి ప్రవర్తన సరైందని ఎవరైనా ఎందుకు అనుకుంటారు? అవతలి వ్యక్తిపై ఎలా చేయి ఎత్తగలుగుతారు? మానవత్వం లేకుండా చేసిన ఈ పనిపై కనీసం పశ్చాత్తాపం, అపరాధభావం ఉండదా? ఇలాంటి మీ ప్రవర్తన చూసి ఎవరైనా మీతో కలిసి ఉండాలనుకుంటారా? ఇది చాలా అవమానకర చర్య. ఇలాంటి ప్రవర్తనను మనం ఎన్నటికీ క్షమించకూడదు. ఈ ఘటనను ఖండించి అతడిని శిక్షించకపోతే అది మనకే సిగ్గుచేటు. ఈ వ్యక్తి జైలుకు వెళ్లాల్సిందే" అని జాన్వీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. తూర్పు కల్యాణ్ ప్రాంతంలోని శ్రీ బాల చికిత్సాలయంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గోకుల్ ఝా అనే వ్యక్తి తన బిడ్డను డాక్టర్‌కు చూపించేందుకు క్యూ పద్ధతి పాటించకుండా ముందుకువెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో రిసెప్షనిస్ట్ అడ్డుకొని అపాయింట్‌మెంట్ లేకపోతే లైనులో రావాలని సూచించారు. దీంతో ఆగ్రహించిన గోకుల్ ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమెను కాలితో తన్నడమే కాకుండా.. జుట్టు పట్టుకొని నేలపై ఈడ్చుకుంటూ వెళ్లాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం అక్కడి నుంచి పరారైన నిందితుడు గోకుల్ ఝా.. తనను గుర్తుపట్టకుండా ఉండేందుకు గడ్డం తీసేసి, జుట్టు కత్తిరించుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇంతకు ముందెప్పుడూ చూడనివిధంగా
# మహేశ్-రాజమౌళి మూవీ





హైదరాబాద్: సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి. మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి రూపొందుతున్న ఈ మూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి అప్‌డేట్‌లు ఎప్పుడొస్తాయా? ఎవరు మాట్లాడతారా? అని మహేశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన నటించిన 'సర్జమీన్' చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు.

"సినిమా కథల ఎంపిక విషయంలో నేనెప్పుడూ ముక్కుసూటిగా ఉంటా. ఏదైనా స్క్రిప్ట్ నాకు సరిపోతుందని అనిపిస్తే నటుడిగా, ఫిల్మ్ మేకర్‌గా కాకుండా ఒక సగటు సినీ ప్రేమికుడి కోణం నుంచి చూసిన తర్వాత ఓకే చెబుతా. అలా చాలా కథలు చేయనని చెప్పిన సందర్భాలు ఉన్నాయి. కానీ, 'సర్జమీన్'కు నో చెప్పడానికి ఒక్క అంశం కూడా కనిపించలేదు. 2022లో నేను ఈ స్క్రిప్ట్ చదివాను. అప్పటికింకా కాజోల్, ఇబ్రహీం అలీ ఈ ప్రాజెక్ట్‌లోకి రాలేదు. సినిమా తీసే విషయంలో దర్శకుడికి స్పష్టత ఉందా? లేదా? అనేది కూడా కచ్చితంగా చూస్తా" అని అన్నారు. 'సర్జమీన్' ఓటీటీ వేదికగా ప్రేక్షకులను అలరించనుంది. జులై 25 వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మహేశ్‌బాబు-రాజమౌళిల మూవీ గురించి మాట్లాడుతూ.. "ఇప్పటివరకూ ఎవరూ ఊహించనిరీతిలో ఈ కథను రాజమౌళి తీర్చిదిద్దుతున్నారు. అదొక అద్భుత దృశ్య కావ్యం. రాజమౌళి సర్ ఎంచుకునే కథలన్నీ భారీగా ఉంటాయి. ఇది కూడా అలాంటిదే. ఎందుకంటే ప్రతిఒక్కరినీ అలరించేలా కథను చెప్పడంలో ఆయన సిద్ధహస్తుడు. ఈ సినిమాను విజువల్ ట్రీట్‌గా తీర్చిదిద్దుతున్నారు" అని పృథ్వీరాజ్ అన్నారు. ప్రస్తుతం కాస్త విరామం ఇచ్చారు. విహారయాత్రలో భాగంగా మహేశ్‌బాబు కుటుంబంతో కలిసి శ్రీలంక వెళ్లారు. మరోవైపు ప్రియాంక చోప్రా కూడా బహమాస్ తీరంలో సేద తీరుతున్నారు. ఆగస్టులో తిరిగి షూటింగ్ ప్రారంభిస్తారని సమాచారం. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం జులైలో టీమ్ అంతా కెన్యాకు వెళ్లాల్సిఉంది. అక్కడి ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్‌లో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించాలని అనుకొన్నారు. ఈ షెడ్యూల్‌లో మహేశ్, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌తో పాటు మరికొందరు ముఖ్య తారాగణం పాల్గొనాల్సి ఉంది. అయితే, ఆ దేశంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఆ షెడ్యూల్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడి కథగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని దీన్ని కేఎల్ నారాయణ నిర్మిస్తుండగా.. ఎం.ఎం.కీరవాణి సంగీతమందిస్తున్నారు.



## నా విషయంలో పేరెంట్స్ ఎక్కువ గర్వపడిందప్పుడే : రష్మిక

తన విషయంలో తల్లిదండ్రులు ఎక్కువగా గర్వపడిన సందర్భాన్ని రష్మిక గుర్తుచేసుకుంది. తాను నటించిన సినిమాల చిత్రీకరణ జ్ఞాపకాలూ నెమరువేసుకుంది. ఓ బ్రాండ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమెకు కొన్ని ఫొటోలు చూపించగా.. వాటి వెనుక కథను చెప్పింది. బెంగళూరు విమానాశ్రయంలో తన తండ్రితో కలిసి దిగిన ఫొటో గురించి చెబుతూ.. "నేను 'ఫ్రెష్ ఫేస్' టైటిల్ గెలిచిన సమయంలో (2014).. కానుకగా కొన్న గొలుసును ఎయిర్‌పోర్టులోనే నాన్న నా మెడలో ధరింపచేశారు. ఈ మరుపురాని క్షణాలను అమ్మ కెమెరాలో బంధించింది. నా విషయంలో పేరెంట్స్ అప్పుడే ఎక్కువగా గర్వపడ్డారని అనుకుంటున్నా" అని పేర్కొంది. సినిమాల గురించి మాట్లాడుతూ.. 'వారసుడు'లో విజయ్‌తో కలిసి నటించే అవకాశం వచ్చినప్పుడు చాలా సంతోషించానని తెలిపింది. 'పుష్ప 2' చిత్రం షూటింగ్ ఆఖరి రోజున భావోద్వేగానికి గురయ్యానని చెప్పింది. ప్రస్తుతానికి ఈ మూవీ టీమ్‌ని మిస్ అవుతున్నానని, 'పుష్ప 3'తో మళ్లీ కలుస్తామని పేర్కొంది. 'యానిమల్' సినిమాతో రణ్‌బీర్ కపూర్ తనకు మంచి స్నేహితుడ య్యాడని, విక్కీ కౌశల్‌తో కలిసి నటించిన 'ఛావా' షూటింగ్‌లో ఎప్పుడూ కష్టమనిపించలేదని తెలిపింది. ఇటీవల విడుదలైన.. 'కుబేర'లో సమీరగా అలరించిన రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్', 'మైసా', 'థామా' తదితర చిత్రాల్లో నటిస్తోంది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com